పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# పెన్షన్ దరఖాస్తులకు 'లాస్ట్ డేట్' ఎత్తివేయాలి..



- బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి అధికారులకి విజ్ఞప్తి..
- అర్హులైనవారికి దరఖాస్తు చేసుకోవడం నిరంతర ప్రక్రియగా కల్పించాలి..!
- దరఖాస్తు చేసుకున్నవి వెంటనే విచారణ చేపట్టాలని విజ్ఞప్తి..
- అర్హత ఉంటే తక్షణమే పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్..
- ఏళ్లతరబడి పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న పేదలను ఆదుకోవాలి..
- వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు న్యాయం చేయాలి: పీసరి కృష్ణారెడ్డి..

-5 లో






సుంకరి నరేష్.. అడ్వకేట్, వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకులు.

# వ్యవసాయ నిపుణుల సదస్సు - 2026..!

- ముఖ్య అతిథిగా హాజరైన, వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర నరేష్..!
- రైతు సమస్యలకు శాస్త్రీయ పరిష్కారమే లక్ష్యమని స్పష్టత..!
- వ్యవసాయ రంగంలో యువతకు నూతన మార్గం..

-4 లో

**హైదరాబాద్, పెన్ పవర్, ఆగస్టు 30:** వ్యవసాయ రంగంలో విద్యావంతులైన యువతకు ఉపాధి, స్వయం ఉపాధితో పాటు అగ్రి బిజినెస్, ఆధునిక సాంకేతిక వ్యవసాయంలో అవకాశాలను పరిచయం చేస్తూ.. రైతులకు క్షేత్రస్థాయిలో శాస్త్రీయ సలహాలు అందించే నిపుణులను తీర్చిదిద్దే దిశగా 'అగ్రి డాక్టర్ ఉద్యమానికి' శ్రీకారం చుట్టారు. నవ నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఆదివారం నిర్వహించిన 'ది ఫార్మిస్ట్ సమ్మిట్--2026' ఇందుకు వేదికగా నిలిచింది.. సుమారు 300 మంది వ్యవసాయ విద్యార్థులు, యువ వ్యవసాయ నిపుణులు పాల్గొన్న ఈ సదస్సులో, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన 24 మంది శాస్త్రవేత్తలు, నిపుణులు, పారిశ్రామికవేత్తలు, అభ్యుదయ రైతులు, అగ్రి బిజినెస్ ప్రతినిధులు, వృత్తి మార్గదర్శకులు పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు..

## 1.06 కోట్ల కుటుంబాలకు

# సన్నబియ్యం

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం 1.06 కోట్ల పేద కుటుంబాలకు తెల్లరేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం ఆయన మధిర నియోజకవర్గంలోని బోనకల్లు, చింతకాని మండలాల్లో రూ.131 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 53 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు, నిరుపేదలకు 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు తొలి ఏడాదిలోనే 70 వేలకు పైగా నియామక పత్రాలు పంపిణీ చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.వేల కోట్ల బకాయిలను చెల్లించినట్లు పేర్కొన్నారు.

**విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం:** రాష్ట్రంలో విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు భట్టి వివరించారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో 100 ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల్ని మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలని 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మిస్తున్నట్లు వివరించారు. మరో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల మంజూరు చేశామని, 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహార కార్యక్రమాన్ని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని విస్తరించినట్లు తెలిపారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక ఆసుపత్రుల్ని అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రహదారి నెట్‌వర్క్ బలోపేతానికి రూ.90 వేల కోట్లతో ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి మరో రూ.30 వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ దివాకర, సీపీ సునిల్‌దత్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

## అత్యాచారానికి యత్నించి.. అంతమొందించి..

# నర్సు మృతి కేసులో పురోగతి



**హైదరాబాద్ పెన్ పవర్::** హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నర్సు (21) కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఆమెను బిహార్ వాసి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సైనా ఉల్లా అనే వ్యక్తి కిటీకీ నుంచి నర్సు గదిలోకి దూకి.. ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలు ప్రతిఘటించగా.. గొంతు నొక్కి కేకలు వేయకుండా అడ్డుకోవడంతో ఆమె మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు పారిపోతుండగా పట్టుకుని.. విచారించగా నేరం అంగీకరించాడు. సైనా ఉల్లా ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్, భాజపా నాయకులు, కుటుంబ సభ్యులు..

-5 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# హైదరాబాద్‌ను లూటీ చేస్తున్న రేవంత్ సర్కారు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ మహానగరాన్ని రేవంత్ సర్కారు లూటీ చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. ఆదివారం జీడిమెట్ల పారిశ్రామిక వాడలో భాజపా మేడ్చల్ అర్బన్ జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, అధ్యక్షుడిగా నియమితులైన గిరివర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న 'కోర్ అర్బన్ రీజియన్' (క్యూర్) చట్టాన్ని అమలు చేస్తే కార్పొరేషన్‌ల మేయర్‌లు, కార్పొరేటర్ల వ్యవస్థకు విలువలేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రజలపై పన్నుల భారం మరింత పడుతుందన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయాలి కానీ, ఇళ్లను కూల్చుతూ, భూములను వేలం వేస్తూ ప్రజలను భయపెడుతోందని మండిపడ్డారు. గత భారాస ప్రభుత్వం బిల్డర్‌ల వద్ద నుంచి 15 శాతం కమీషన్లు తీసుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా 30 శాతానికి పెంచిందని ఆరోపించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జయశ్రీ, జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

## నీట్-పీజీకి రెండు కేంద్రాల్లో

# తీవ్ర అంతరాయం

## ఆ అభ్యర్థులకు జైపూర్‌లో 5న మళ్లీ పరీక్ష

## రాష్ట్రంలో 97.26% మంది హాజరు

**హైదరాబాద్ పెన్ పవర్:** కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య దేశవ్యాప్తంగా నీట్–పీజీ (2026)ని విజయవంతంగా నిర్వహించినట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఎంఎస్) వెల్లడించింది. 339 నగరాల్లోని 1,111 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షకు 2.63 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపింది. అయితే, జైపూర్‌లోని సీతాపురాలో రెండు ఐడీజడ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల 2,445 మంది అభ్యర్థులు పరీక్షను పూర్తి చేయలేకపోరు. వీరికి సెప్టెంబరు 5న జైపూర్‌లో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. కాగా, రాష్ట్రంలో 'నీట్ పీజీ–2026' ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 14 జిల్లాల్లోని 56 పరీక్ష కేంద్రాల్లో 17,143 (97.26%) మంది అభ్యర్థులు హాజరుకాగా, 483 మంది గైర్హాజరయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని టీసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రీజనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, శాఖ కార్యదర్శి క్రిస్టినా పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

**మధ్యస్తం నుంచి కఠినంగా..**



ఆదివారం నిర్వహించిన నీట్‌పీజీ–2026 పరీక్ష ప్రశ్నాపత్రం గతేడాదితో పోలిస్తే మధ్యస్తం నుంచి కఠినంగానే ఉందని విద్యార్థులు, నిపుణులు అభిప్రాయపడ్డారు. క్లినికల్ ఆధారితంగా సుదీర్ఘమైన ప్రశ్నలు వచ్చాయని, దాంతోపాటు చిత్ర ఆధారితమైనవి (ఇమేజ్ బేస్డ్) అడిగినట్లు వెల్లడించారు. జనరల్ మెడిసిన్, అబ్‌స్టెట్రిక్స్–గైనకాలజీ (ఓబీజీ), ఫార్మకాలజీ, పాథాలజీ సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.




సదస్సుకు హాజరైన ప్రముఖులు..

# వ్యవసాయ నిపుణుల సదస్సు - 2026..!



సుంకరి నరేష్.. అడ్వకేట్, వెన్నెల పౌండేషన్ వ్యవస్థాపకులు.

- ముఖ్య అతిథిగా హాజరైన, వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర నరేష్..!
- రైతు సమస్యలకు శాస్త్రీయ పరిష్కారమే లక్ష్యమని స్పష్టత..!
- వ్యవసాయ రంగంలో యువతకు నూతన మార్గం..

- 'అగ్రి డాక్టర్' ఉద్యమానికి నాంది..!
- 24 మంది నిపుణులతో మార్గదర్శనం..!
- 300 మంది విద్యార్థులకు అవగాహన..!
- ఏఐతో ఆధునిక వ్యవసాయంపై దిశా నిర్దేశం..!
- అగ్రి బిజినెస్, స్వయం ఉపాధిపై సూచనలు..!
- రైతులు--నిపుణుల మధ్య వారధిగా సాంకేతికత..

**హైదరాబాద్, పెన్ పవర్, ఆగస్టు 30:** వ్యవసాయ రంగంలో విద్యావంతులైన యువతకు ఉపాధి, స్వయం ఉపాధితో పాటు అగ్రి బిజినెస్, ఆధునిక సాంకేతిక వ్యవసాయంలో అవకాశాలను పరిచయం చేస్తూ.. రైతులకు క్షేత్రస్థాయిలో శాస్త్రీయ సలహాలు అందించే నిపుణులను తీర్చిదిద్దే దిశగా 'అగ్రి డాక్టర్ ఉద్యమానికి' శ్రీకారం చుట్టారు. నవ నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఆదివారం నిర్వహించిన 'ది ఫార్మిస్ట్ సమ్మిట్--2026' ఇందుకు వేదికగా నిలిచింది.. సుమారు 300 మంది వ్యవసాయ విద్యార్థులు, యువ వ్యవసాయ నిపుణులు పాల్గొన్న ఈ సదస్సులో, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన 24 మంది శాస్త్రవేత్తలు, నిపుణులు, పారిశ్రామికవేత్తలు, అభ్యుదయ రైతులు, అగ్రి బిజినెస్ ప్రతినిధులు, వృత్తి మార్గదర్శకులు పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు..




## రైతుకు సాంకేతిక అండ అవసరం: సుంకరి నరేష్..

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది, వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర నరేష్ మాట్లాడుతూ.. తాను రైతు బిడ్డగా, రైతుల కష్టాలను ప్రత్యక్షంగా తెలిసిన వ్యక్తిగా ఈ వేదికకు వచ్చానన్నారు. ఏఐ సహా ఆధునిక సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైతులు కూడా సాంప్రదాయ విధానాలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు..గతంలో "ఎండ్రిన్" వంటి ప్రమాదకరమైన పురుగు మందుల వినియోగంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకూడదన్నారు.. పంటలు, తెగుళ్లు, పురుగు మందుల వినియోగం తదితర అంశాల్లో రైతులకు సరైన సమయంలో సరైన సలహాలు అందించేందుకు శాస్త్రీయ పరిజ్ఞానం కలిగిన వ్యవసాయ నిపుణులు అవసరమని పేర్కొన్నారు..

## రైతు ఆధునికంగా మార్పు చెందాలి..

ఇంటర్నెట్‌లో 'రైతు' అని వెతికితే బక్కచిక్కిన రైతు ఆకాశం వైపు చూస్తున్న దృశ్యమే కనిపించే పరిస్థితి మారాలని సుంకర నరేష్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి సాధిస్తున్న ఆధునిక వ్యవసాయదారుడిగా రైతు ప్రపంచానికి కనిపించేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ కోర్సుల వైపు మరింతగా ఆకర్షితులు కావాలని పిలుపునిచ్చారు.. వ్యవసాయ విద్యను కేవలం ఉద్యోగానికి పరిమితం చేయకుండా రైతులకు సేవ చేయడం, స్వయం ఉపాధి, అగ్రి బిజినెస్, సాంకేతిక వ్యవసాయం వంటి విస్తృత అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు..

## సాంకేతిక వారధి బలోపేతం అవసరం..

రైతు సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు చూపగల 'అగ్రి డాక్టర్లను' తయారు చేయడమే ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రైతులు--వ్యవసాయ నిపుణుల మధ్య సాంకేతిక వారధిని బలోపేతం చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని పేర్కొన్నారు.. సదస్సులో పాల్గొన్న నిపుణులు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, అగ్రి బిజినెస్, ఉపాధి అవకాశాలు, రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు అందించే విధానాలపై విద్యార్థులకు మార్గదర్శకాలు చేశారు.. ఈ కార్యక్రమాన్ని నవ నిర్మాణ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు రాంబాబు పొన్నాన, ఉపాధ్యక్షురాలు అడ్వకేట్ సాయి జ్యోతి యు.జగదీశ్వరరావు పొన్నానతో పాటు సంస్థ సభ్యులు సమన్వయంతో నిర్వహించారు. వ్యవసాయ విద్యార్థులు, యువ నిపుణులకు వృత్తిపరమైన దిశానిర్దేశం అందించిన ఈ సదస్సు వ్యవసాయ రంగంలో కొత్త ఆలోచనలకు వేదికగా నిలిచింది.





పీసరి కృష్ణారెడ్డి..
బీజేపీ నేత..



# పెన్షన్ దరఖాస్తులకు 'లాస్ట్ డేట్' ఎత్తివేయాలి

- బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి అధికారులకి విజ్ఞప్తి..
- అర్హులైనవారికి దరఖాస్తు చేసుకోవడం నిరంతర ప్రక్రియగా కల్పించాలి..!
- దరఖాస్తు చేసుకున్నవి వెంటనే విచారణ చేపట్టాలని విజ్ఞప్తి..
- అర్హత ఉంటే తక్షణమే పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్..
- ఏళ్లతరబడి పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న పేదలను ఆదుకోవాలి..
- వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు న్యాయం చేయాలి: పీసరి కృష్ణారెడ్డి..

**దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 30:** వితంతువులు, వికలాంగులు, వృద్ధులు, ఇతర అర్హులైన పేదలకు పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను నిరంతరంగా కొనసాగించాలని, దరఖాస్తు చేసుకున్న వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయాలని దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. గతంలో పెన్షన్ కోసం నిరంతరం దరఖాస్తులు స్వీకరించే విధానం ఉండేదని ఆయన గుర్తుచేశారు. అయితే తెలంగాణ ఏర్పడిన అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన అనేక మంది వృద్ధులు, నిరుపేదలు, ఇతర అర్హులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుని మంజూరు కోసం ఎదురుచూస్తూనే పలువురు కాలం చేసిన పరిస్థితులు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెన్షన్ల దరఖాస్తులకు గడువులు విధించడం వల్ల అర్హులైన అనేక మంది పేదలు అవకాశాన్ని కోల్పోతున్నారని కృష్ణారెడ్డి అన్నారు.. గతంలో ఏళ్ల తరబడి ఎదురు చూసిన వారు, ప్రస్తుతం పెన్షన్ కోసం అదే పరిస్థితి కొనసాగటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.. పెన్షన్‌కు అర్హులైన నిరుపేదల పరిస్థితిని ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిగణనలోకి తీసుకోవాలని కోరారు..

### పెన్షన్ దరఖాస్తుకు 'చివరి తేది' ఎత్తివేయాలి..

పెన్షన్ దరఖాస్తులకు 'లాస్ట్ డేట్' విధానాన్ని పూర్తిగా తొలగించి, అర్హత ఉన్న వారు ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నా వెంటనే విచారణ జరిపి పెన్షన్ మంజూరు చేసే విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, నిరుపేదలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సరళమైన విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న అభాగ్యులకు ఇకనైనా న్యాయం చేయాలని పీసరి కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## అత్యాచారానికి యత్నించి.. అంతమొందించి.. నర్సు మృతి కేసులో పురోగతి

-3 పేజి తరువాయి

న్యాయం చేయాలని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు.

ఏమైందంటే..

కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన యువతి ఏడు నెలల క్రితం మహేశ్వరంలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. ఓ ఆసుపత్రిలో నర్సుగా చేరారు. అదే ఆసుపత్రికి చెందిన గదిలో ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం గదికి వెళ్లి.. మళ్లీ ఆసుపత్రికి తిరిగిరాలేదు. యాజమాన్యం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో.. ఆమె ఉంటున్న గదికి సిబ్బందిని పంపించారు. గది తలుపులు లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో కిటికీ సందులోంచి చూడగా ఆమె నేలపై పడి ఉంది. తలుపు విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఒంటిపై గాయాలు గమనించి.. ఆమె మృతిపై అనుమానముందని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పదవుల కోసం, పైసల కోసం ఎంత నీచానికైనా దిగజారుతావ్.. హరీశ్ రావుపై మంత్రి పొంగులేటి ఫైర్




**హైదరాబాద్ పెన్ పవర్:** పదవులు, డబ్బు కోసమే మాజీ మంత్రి హరీశ్ రావు ఎంత నీచానికైనా దిగజారి రాజకీయం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని కబ్జా చేసేందుకు చివరకు హరీశ్ రావు మరింతగా దిగజారిపోయారని దుయ్యబట్టారు. మామ కేసీఆర్ ఆరోగ్యం బాగుండకూడదని క్షుద్రపూజలు చేయించారని, ఈ విషయం స్వయంగా కేసీఆర్ కుమార్తె కవిత ప్రకటించారంటే, హరీష్ రావు వ్యక్తిత్వం ఎంత నీచమైనదో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇలాంటి తప్పుడు మనస్తత్వం కలిగిన వ్యక్తి కాబట్టే... తన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు, రాజకీయ పబ్బం గడుపుకోవడానికి హరీష్ రావు ప్రతిరోజూ చేస్తున్న అసత్య ప్రచారాలను తెలంగాణ ప్రజలు నమ్మడం లేదన్నారు. ఆనాడు అగ్గిపెట్టె లేదంటూ యువకులను రెచ్చగొట్టి శవ రాజకీయాలు చేసిన హరీశ్ రావు.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పైసల కోసం మంత్రి పదవిని అడ్డుపెట్టుకొని అనైతికంగా ఆసుపత్రులతో పాల వ్యాపారం చేశారని ఆరోపించారు. ఈ మేరకు ఇవాళ ఎక్స్ వేదికగా మంత్రి విమర్శలు గుప్పించారు.

**ఒక్కటి గుర్తు పెట్టుకో..**

మామ కేసీఆర్ పై క్షుద్రపూజల దగ్గర నుంచి పాల పేరుతో చేసిన పాపపు వ్యాపారాల దాకా అన్ని అవలక్షణాలు ఉన్న హరీశ్ రావు ఒక్కటి గుర్తుపెట్టుకో... ఎన్ని కుట్రలు చేసినా, ప్రతి రోజు పెయిడ్ సోషల్ మీడియాలో ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ధరణి పేరుతో దొరలు చేసిన దోపిడీని బయటికి తీయడం ఖాయం అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి, పేదల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడం కూడా ఖాయం అన్నారు. హరీశ్ రావు నీ కుట్రలు, ప్రజలకు మంచి చేయాలనే గొప్ప పరిపాలన అందించాలనే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని అడ్డుకోలేవన్నారు.

## పిట్లంలో ఘనంగా బారెడు పోచమ్మ బోనాలు






హైదరాబాద్ పెన్ పవర్:

పిట్లం: పిట్లం గ్రామంలో బారెడు పోచమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఉత్సవాల్లో భాగంగా కళాకారుల నృత్యాలు, శివసత్తుల విన్యాసాలు, డీజే సౌండ్ల నడుమ బోనాలను పురవీధుల గుండా వైభవంగా ఊరేగించారు. భక్తుల జయజయధ్వానాలతో గ్రామ వీధులు మార్మోగాయి. అనంతరం ఊరి పొలిమేరలో ఉన్న బారెడు పోచమ్మ ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. బోనాల సమర్పణ అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ ఉత్సవాల్లో మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు అరుణతార, హనుమంత్ షిండే,గ్రామ సర్పంచ్ కుమ్మరి శేఖర్, బిజెపి నాయకులు బత్తిని జగదీష్,అశోక్ రాజ్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## బారేడు పోచమ్మ బోనాల్లో మహిళల భక్తి సందడి

బోనాలతో భారీగా తరలివచ్చిన మహిళలు.. సంప్రదాయబద్ధంగా ఊరేగింపు






హైదరాబాద్ పెన్ పవర్:

పిట్లం: మండల కేంద్రంలో బారేడు పోచమ్మ అమ్మవారి బోనాల పండుగలో మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదివారం నిర్వహించిన బోనాల ఊరేగింపులో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, నెత్తిన బోనాలను మోస్తూ మహిళలు భక్తిగీతాలు, మంగళహారతులతో ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామ ప్రజలకు ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొనడంతో బోనాల వేడుకకు ప్రత్యేక శోభ సంతరించుకుంది.మహిళల సంప్రదాయ వేషధారణ, నెత్తిన బోనాలతో సాగిన ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. మహిళల పెద్ద ఎత్తున పాల్గొనడంతో పిట్లం పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

## వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో అధిక సంఖ్యలో పాల్గొన్న పోచమ్మ దేవాలయం



హైదరాబాద్ పెన్ పవర్:
వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని పోచమ్మ దేవాలయం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం పోచమ్మ దేవాలయానికి ఈరోజు బుధవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ తమ మొక్కుకోవడం జరిగింది తమ కోరికలను తీర్చిన తల్లికి మొక్కులు తీర్చేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు తల్లికి కోరికలను సమర్పించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడం జరిగింది కొత్త కోరికలతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ కోరికలను కోరుకుంటూ భక్తులు అధిక సంఖ్యలో వచ్చిన భక్తులను తమ భక్తి పరవశంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తులను కోరికలు తీర్చుకునేవారు తీర్చుకుంటూ కోరుకునేవారు కోరుకుంటూ ఎంతో కోలాహలంగా ఈరోజు బుధవారం సవ్యంగా జరిగింది ఇందుకు దేవాలయము కమిటీ వారు చాలా ఓపికతో ప్రజలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వర్షాభావం నుండి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకొని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి వర్షం కు భక్తులు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా కమిటీ సభ్యులు భక్తులకు ఎప్పటికప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకొని పోచమ్మ తల్లి శ్రావణ మాస వేడుకలు చాలా ఉత్సాహంగా ఆనందంగా జరుపుకునేలా జాగ్రత్తలు తీసుకుంటున్న కమిటీ. నీ పోచమ్మ తల్లి దర్శనానికి వచ్చిన భక్తులు కమిటీ సభ్యులను కమిటీ చేసిన సౌకర్యాలకు ఆనందం వ్యక్తం చేశారు.

## ఆర్క్ అర్థ, ఆర్క్ ఆర్యమాలతో ప్రీమియం రెసిడెన్షియల్..

పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తున్న ఆర్క్ గ్రూప్




హైదరాబాద్ పెన్ పవర్: విలాసవంతమైన నివాస జీవనంలో మరో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతూ, కొంగర కలాన్‌లో 'ఆర్క్ అర్థ', 'ఆర్క్ ఆర్యమా' పేర్లతో రెండు ప్రీమియం విల్లా సముదాయాలను ఆర్క్ గ్రూప్ ప్రారంభించింది. ఈ శుభప్రదమైన ప్రారంభోత్సవ కార్యక్రమానికి శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామిజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన రాకతో కార్యక్రమానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యత చేకూరింది.

ఆర్క్ అర్థ, ఆర్క్ ఆర్యమా ప్రాజెక్టుల ద్వారా గోప్యత, ప్రకృతి, విశాలమైన జీవన ప్రదేశాలు, ప్రపంచ స్థాయి సౌకర్యాలను సమన్వయం చేస్తూ సమకాలీన విలాసవంతమైన జీవన విధానాన్ని పునర్నిర్వచించడం తమ లక్ష్యమని ఆర్క్ గ్రూప్ తెలిపింది. కొంగరకలాన్‌లో వ్యూహాత్మకంగా అభివృద్ధి చేసిన ఈ రెండు ప్రాజెక్టులు బలమైన కనెక్టివిటీ, వేగంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాల కారణంగా హైదరాబాద్‌లోని కీలక అభివృద్ధి కారిడార్లలో ఒకటిగా నిలుస్తున్న ప్రాంతంలో ఉన్నాయి. 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందుతున్న భారత్ ఫ్యూచర్ సిటీలో పారిశ్రామిక, నివాస, విద్య, ఆరోగ్య సంరక్షణ, వినోద రంగాలకు సంబంధించిన సమీకృత మౌలిక సదుపాయాలు ఏర్పడనున్న నేపథ్యంలో ఈ ప్రాంతం మరింత ప్రాధాన్యత సంతరించుకుంటోంది. అలాగే ప్రతిపాదిత మెట్రో ఫేజ్-2 విస్తరణలు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మెరుగైన కనెక్టివిటీ, విమానాశ్రయ విస్తరణతో పాటు భవిష్యత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కొంగర కలాన్‌కు మరింత అనుకూలతను కల్పిస్తున్నాయని సంస్థ పేర్కొంది. ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ హబ్ తదితర ప్రాజెక్టులతో దీర్ఘకాలంలో ఈ ప్రాంతం మరింత మెరుగైన అనుసంధానాన్ని పొందే అవకాశం ఉందని తెలిపింది.

### వారసత్వ వైభవానికి ప్రతీకగా 'ఆర్క్ అర్థ'

వారసత్వపు వైభవం, ఆధునిక విలాసాన్ని మేళవించేలా ఆర్క్ అర్థను రూపొందించారు. విశాలమైన ప్రదేశాలు, ప్రత్యేకత, ప్రశాంతమైన జీవనశైలికి ప్రాధాన్యత ఇచ్చే వారి కోసం ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దారు. నగర జీవనంలోని రద్దీ, ఇరుకుదనానికి దూరంగా ప్రశాంతమైన వాతావరణాన్ని అందించేలా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. పచ్చని ల్యాండ్‌స్కేపింగ్, విశాలమైన బహిరంగ ప్రదేశాలు, ప్రశాంతమైన జీవనశైలితో పాటు కాలాతీతమైన హుందాతనాన్ని ప్రతిబింబించే నిర్మాణ శైలిని ఇందులో పొందుపరిచారు. నిర్మాణ నైపుణ్యంతో పాటు 22,000 చదరపు అడుగుల క్లబ్‌హౌస్, ఇతర ప్రీమియం సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆర్క్ గ్రూప్ తెలిపింది.

### సహజ కాంతి, పచ్చదనానికి ప్రాధాన్యతగా 'ఆర్క్ ఆర్యమా'

మరోవైపు ఆర్క్ ఆర్యమా ఆధునిక విల్లా జీవనానికి ప్రత్యేకమైన అనుభూతిని అందించేలా రూపొందించబడింది. సహజ కాంతి, పచ్చదనం, ప్రశాంతతకు ప్రాధాన్యతనిస్తూ విశాలమైన నివాస ప్రదేశాలను తీర్చిదిద్దారు. ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందించేలా పచ్చని పరిసరాల మధ్య విశాలమైన ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులోని ప్రధాన ఆకర్షణల్లో 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన క్లబ్‌హౌస్ ఒకటి. దీనికి 30కి పైగా సౌకర్యాలు జోడించి, నివాసితులకు సమగ్ర జీవనశైలి అనుభవాన్ని అందించేలా రూపొందించారు.

### ఆర్క్ గ్రూప్ సీఎండీ జి. రామ్ రెడ్డి

ఆర్క్ గ్రూప్ సీఎండీ శ్రీ జి. రామ్ రెడ్డి మాట్లాడుతూ, "ఆర్క్ అర్థ, ఆర్క్ ఆర్యమాలను ప్రారంభించడం ద్వారా నిర్మాణ శైలి, సౌకర్యాలకు మాత్రమే పరిమితం కాకుండా, విలాసవంతమైన జీవన విధానంపై మా దృక్పథాన్ని ముందుకు తీసుకువస్తున్నారు. విశాలమైన ప్రాంగణాలు, ఏకాంతం, ప్రశాంతత, ప్రకృతితో శాశ్వత అనుబంధాన్ని పెంపొందించే గృహాలను సృష్టించడమే మా లక్ష్యం. ఆర్క్ అర్థ వారసత్వపు వైభవాన్ని, ఉన్నతమైన జీవన విధానాన్ని ప్రతిబింబిస్తే, ఆర్క్ ఆర్యమా సహజ కాంతి, పచ్చదనం, ఉత్సాహభరితమైన సామూహిక అనుభూతిని ఒకచోట చేర్చుతుంది. ప్రతి అంశాన్ని ఎంతో ఆలోచనాత్మకంగా తీర్చిదిద్దాం. విలాసం అనేది కేవలం సౌకర్యాలు, నిర్మాణంలోని సూక్ష్మ అంశాల్లోనే కాకుండా, ప్రతిరోజూ జీవించే విధానంలోనూ అనుభూతి చెందేలా నివాసితులకు ప్రత్యేకమైన జీవనశైలిని అందించడమే మా లక్ష్యం" అని అన్నారు.

### ఆర్క్ గ్రూప్ సీఈఓ మేఘనా గుమ్మి

ఆర్క్ గ్రూప్ సీఈఓ శ్రీమతి మేఘనా గుమ్మి మాట్లాడుతూ, "ఆర్క్ అర్థ, ఆర్క్ ఆర్యమా సాంప్రదాయ విలాసాలకు అతీతంగా ఉండే కమ్యూనిటీలను సృష్టించాలనే మా లక్ష్యాలకు ప్రతీకలన్నారు. ఆలోచనాత్మకమైన డిజైన్, గోప్యత, విశాలమైన ప్రదేశాలు, బలమైన అనుబంధ భావనను ఒకచోట చేర్చడంపై మేము దృష్టి సారించాం. అదే సమయంలో ప్రతి అంశంలో నాణ్యత, నైపుణ్యం, శాశ్వత విలువలు ప్రతిబింబించేలా చూసుకున్నారు. ఈ రెండు కమ్యూనిటీల ద్వారా అత్యున్నత స్థాయి నివాసాలను మాత్రమే కాకుండా, కుటుంబాలు అర్థవంతమైన వారసత్వాలను నిర్మించుకునేలా శాశ్వతమైన నివాస ప్రాంగణాలను సృష్టిస్తున్నాం" అని తెలిపారు.

### ప్రీమియం రెసిడెన్షియల్ విభాగంలో విస్తరణ

నిర్మాణ శైలి, ప్రకృతి, వ్యక్తిగత గోప్యత, విలాసవంతమైన జీవనశైలిని సమన్వయం చేస్తూ అత్యున్నత ప్రమాణాలతో నివాస సముదాయాలను అందించాలన్న ఆర్క్ గ్రూప్ దార్శనికతకు ఆర్క్ అర్థ, ఆర్క్ ఆర్యమా ప్రతిబింబాలుగా నిలుస్తున్నాయి. కొంగరకలాన్‌లోని ఈ రెండు ప్రాజెక్టులు విశాలమైన బహిరంగ ప్రదేశాలు, పచ్చదనంతో బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తూనే నివాసితులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన జీవన అనుభవాన్ని అందించేలా రూపొందించబడ్డాయి. ఈ ప్రారంభోత్సవం ఆర్క్ గ్రూప్‌కు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. కేవలం ఇళ్లను నిర్మించడం కాకుండా, ప్రత్యేకమైన జీవనశైలిని ప్రతిబింబించే ప్రీమియం కమ్యూనిటీలను సృష్టించే దిశగా సంస్థ తన రెసిడెన్షియల్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరిస్తోంది.

## 'గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణే'



హైదరాబాద్ పెన్ పవర్: గోదావరి పుష్కరాలు అనగానే ఇప్పటివరకు రాజమహేంద్రవరం పేరు వినిపించేదని, కానీ ఇకపై 'గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ, తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు' అనేలా వచ్చే ఏడాది పుష్కరాల నిర్వహణ ఉండాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం గోదావరి పుష్కరాలు-2027 పనుల సమన్వయం కోసం ప్రజాభవన్‌లోని మొదటి అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన 'ప్రత్యేక అధికారి (స్పెషల్ ఆఫీసర్) కార్యాలయాన్ని' ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులతో ఏర్పాట్లపై మంత్రి సురేఖ సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి రూ.1000 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు, తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వసతులు కల్పించాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ఈ ప్రత్యేక అధికారి కార్యాలయం కేంద్ర బిందువుగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.

### 'నేపాల్ ఇల్లు' తరహాలో నాణ్యత ఉండాలి..

పుష్కరాల పనుల నాణ్యతపై మంత్రి సురేఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల నేపాల్‌లో వచ్చిన భీకర వరదల్లో చుట్టుపక్కల నిర్మాణాలు కొట్టుకుపోయినా, ఒక ఇల్లు మాత్రం చెక్కుచెదరకుండా నిలిచిన తీరును ఆమె ఈ సందర్భంగా ఉదాహరణగా ప్రస్తావించారు. గోదావరి పుష్కరాల కోసం చేపట్టే నిర్మాణాలు కూడా తాత్కాలికంగా కాకుండా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అత్యంత నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. భక్తులు స్నానాలు చేసే ఘాట్ల వద్ద పటిష్టమైన గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు పకడ్బందీగా వసతులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు మంత్రికి పనుల పురోగతిని వివరించారు. ఇప్పటికే టైర్ 1, 2, 3 పరిధిలో 5 కి.మీకి పైగా ఘాట్‌ల నిర్మాణం చేపట్టనున్నామని, అప్రోచ్ రోడ్లు, మెడికల్, పోలీస్, టూరిజం శాఖలకు నిధులు విడుదలైనట్లు తెలిపారు. పలు ఘాట్ల నమూనా చిత్రాలను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్జేసి రామకృష్ణారావు, డిసి కృష్ణ ప్రసాద్, పలువురు అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లై ఓవర్ పై కారు హల్‌చల్



**హైదరాబాద్ పెన్ పవర్:** గద్వాల పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై మద్యం మత్తులో ఓ యువకుడు కారు నడుపుతూ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి బ్రిడ్జిపై ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో కారు కొంతమేర దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రమాదం అనంతరం కారు నడుపుతున్న వ్యక్తి వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది. సదరు వ్యక్తి పెబ్బేరు మండలం రంగాపురం గ్రామానికి చెందినవాడిగా సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. కాగా, ప్రమాదానికి గురైన కారును పోలీసులు పరిశీలించగా 15 ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

దీంతో వాహనదారుల నిర్లక్ష్యం పై స్థానికంగా చర్చ జరుగుతోంది. ఫ్లై ఓవర్ పై కారు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి కొంతసేపు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న గద్వాల ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురైన కారును పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీంతో వాహనాల రాకపోకలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు సూచిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, కారు డ్రైవర్ ఆచూకీ పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు మూసారాంబాగ్ బ్రిడ్జి ప్రారంభం



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న మూసారాంబాగ్ బ్రిడ్జీ నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం 2022లో పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.52 కోట్లు. మొత్తం 400 మీటర్ల పొడవుతో వంతెనను నిర్మించారు. వంతెన వెడల్పు 14.5 మీటర్లు కాగా, పాదచారుల కోసం 3.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు. ఈ వంతెన నిర్మాణంతో అంబర్‌పేట్––మూసారాంబాగ్ మధ్య ఏడాది పొడవునా, అన్ని కాలాల్లో రాకపోకలకు వీలు కలగనుంది. ముఖ్యంగా వర్షాకాలంలో మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు ఏర్పడే నీటి ముంపు, రాకపోకల అంతరాయాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. దీంతో రెండు ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మరింత మెరుగుపడి, ప్రజలకు సురక్షితమైన, నిరంతరాయమైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది.

**కమిషనర్ కర్ణన్ సమీక్ష..**

మూసారంబాగ్ వంతెన, నల్గొండ ఫ్లైఓవర్ పనులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ ఆదివారం తనిఖీ చేశారు.రెండు ఫ్లైఓవర్ల పనుల గురించి అధికారులతో సమీక్షించారు. మూసారాంబాగ్ బ్రిడ్జీ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. చంచల్ గుడ ఫ్లైఓవర్ వద్ద, ప్రధాన ఫ్లైఓవర్ పూర్తయిందని, దీని ప్రారంభోత్సవానికి మార్గం సుగమం చేస్తూ, ఏ4 అప్–ర్యాంప్‌ను ఆదివారం, చంపాపేట్ వైపు వెళ్లే ఏ3 సైడ్ ర్యాంప్‌ను రెండు మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, చంచల్‌గూడ, సైదాబాద్, సంతోష్ నగర్, ఐఎస్ సదన్, ఒవైసీ హాస్పిటల్, కంచన్ బాగ్, చంపాపేట్ మరియు సాగర్ రోడ్ గుండా ప్రయాణించే ప్రయాణికులకు ఇది గణనీయమైన ఉపశమనాన్ని అందిస్తుందన్నారు.

# లారీ క్యాబిన్‌లో మహిళ దారుణ హత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** లారీ డ్రైవర్‌తో పరిచయం ఉన్న ఓ మహిళను లారీ క్యాబిన్‌లోనే గొంతు కోసి హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆగస్టు 18వ తేదీన జరిగిన మహిళ హత్యలో సింగంపల్లి తండాకు చెందిన జటావత్ లల్లిని హత్య చేసినట్లు కేసు వివరాలను ఆదివారం రాజాపూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న నిందితుడికి మృతురాలితో గత కొంతకాలంగా పరిచయం ఉంది. ఇద్దరూ కలిసి మద్యం సేవించేవారని, కొంతకాలంగా వారి మధ్య వివాదాలు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 16న లారీ నంబర్ ఎ=47 ఎ 7399లో సరుకు లోడ్ చేసుకుని డెలివరీ కోసం బయలుదేరిన నిందితుడు, మృతురాలికి ఫోన్ చేసి తన వద్దకు రావాలని కోరినట్లు తెలిపారు.అనంతరం ఆమెను లారీలోకి తీసుకెళ్లి మద్యం సేవించినట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో ఉన్న సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో, నిందితుడు కత్తితో మహిళ గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు పత్రాల్లో ఉంది. అనంతరం మృతదేహాన్ని లారీ క్యాబిన్‌లోని వస్త్రాలతో చుట్టి, రోడ్డు పక్కన ఉన్న గడ్డిలో పడేసి, లారీతో అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ మహేష్, ఎస్సై రాజశేఖర్ వారి బృందం సీసీ కెమెరాల ఆధారంగా పది రోజుల సమయంలో కేసును టేకప్ చేసి నిందితుడిని పట్టుకున్నందుకు డీఎస్పీ వెంకటేశ్వర్లు సిబ్బందిని అభినందించారు.

## హైదరాబాద్ సహా మూడు కార్పొరేషన్లలో జనసేన పోటీ : ప్రకటించిన తాళ్ళూరి రామ్



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బలంగా పోటీ చేస్తుందని పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి రామ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మూడు కార్పొరేషన్ల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనసేన శ్రేణులు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజాక్షేత్రంలో జనసేన పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

జనసేన తెలంగాణ ఇన్చార్జ్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ఆవిర్భావం నుంచీ జనసేన బలోపేతం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని తెలిపారు. రాష్ట్ర రాజకీయ భవితవ్యానికి ఈ ఎన్నికలే దిక్సూచి కానున్నాయని, ఈ ఫలితాలే రాష్ట్ర భవిష్యత్ ను నిర్ణయిస్తాయని పేర్కొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తెలంగాణ కాంగ్రెస్ లో అనూహ్య పరిణామాలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందా? ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలహీన పడుతున్నారా? రాష్ట్రంలో ఆయనకు అంటూ సొంతవర్గం లేకపోయిందా? అంటే ఔను అనే సమాధానమే ఎక్కువగా వినిపిస్తోందని అంటున్నారు ప్రముఖ జర్నలిస్టు, ఏబీఎన్ సంస్థల అధినేత రాధాకృష్ణ (ఆర్కే). వర్తమాన రాజకీయ అంశాలపై ఆయన ప్రతి ఆదివారం రాసే 'కొత్తపలుకు' కాలమ్ లో సంచలన విషయాలను వెల్లడించారు. ఆర్కే విశ్లేషణ ప్రకారం వచ్చే ఏడాది తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకోబుతున్నాయట.. దీంతో ఆర్కే విశ్లేషణపై తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది.తెలంగాణలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై ఆర్కే తన కొత్తపలుకులో విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యతిరేకులు అందరూ ఏకమవుతున్నారని, ఆయనకు వ్యతిరేకంగా రాజకీయాలు ఊపందుకున్నాయని వెల్లడించారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్ లోకి వెళుతున్నారని, ఇంకా రెండేళ్లు అధికారం ఉండగానే, అధికార పార్టీ ఎమ్మెల్యేలు సర్దుకుంటుండటం తప్పుడు సంకేతాలు ఇస్తోందని రాసుకొచ్చారు. ఇవన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాగ్రత్త పడటానికి హెచ్చరికగానే పరిగణించాలని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఇక తెలంగాణలో బలమైన నాయకుడు కోసం బీజేపీ ప్రయత్నిస్తుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బలహీన పర్చడానికి కాంగ్రెస్ పార్టీలో ఆయన వ్యతిరేకులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ కుమార్తె విషయంలో చర్యలు తీసుకునేందుకు కాంగ్రెస్ అధిష్టానం సమయం తీసుకోవడంపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. సురేఖపై చర్యలు లేకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరింత బలహీనమవుతారని, అంతిమంగా ఎన్నికలకు ఏడాది ముందే కాంగ్రెస్ లో కల్లోలం పతాకస్థాయికి చేరుకుంటుందని ఆర్కే విశ్లేషణగా ఉందని అంటున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆప్తుడిగా భావిస్తున్న సీనియర్ జర్నలిస్టు ఆర్కే విశ్లేషణ కాంగ్రెస్ రాజకీయాలుపై సరికొత్త సందేహాలకు తావిస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషయంలో సగం మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. మంత్రి సురేఖ విషయంలో ముఖ్యమంత్రికి మద్దతుగా కొద్దిమంది ఎమ్మెల్యేలు మాత్రమే మీడియా ముందుకు రావడాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ పరిణామాలను ఉటంకిస్తూ ఆర్కే తన విశ్లేషణలో కాంగ్రెస్ లో తుఫాన్ వచ్చే సూచనలు ఉన్నాయని ముందస్తు హెచ్చరికలు జారీ చేశారని అంటున్నారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మేల్కొలిపేందుకు కూడా పనికొస్తుందని అంటున్నారు. అయితే ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా ఎదుర్కొంటారు అనేది మునుముందు చూడాల్సివుందని అంటున్నారు.

# రిపేర్లు మొదలు : కిషన్ రెడ్డికి మరిన్ని బాధ్యతలు !



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణాకు చెందిన జి కిషన్ రెడ్డి సీనియర్ నాయకుడు. ఆయన విద్యార్థి రాజకీయాల నుంచి బీజేపీలో పనిచేశారు. ఏబీవీపీ నుంచి యువ మోర్చా దాకా అక్కడ నుంచి బీజేపీలో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉమ్మడి ఏపీలో పనిచేశారు. ఆయన ఎమ్మెల్యేగా అంబర్ పేట నుంచి మూడు సార్లు గెలిచారు. శాసన సభా పక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. ఇక గత రెండు పర్యాయాలుగా ఆయన ఎంపీగా గెలిచారు. సికింద్రాబాద్ నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్రంలో మంత్రిగా ఏడేళ్ళుగా కొనసాగుతున్నారు. తెలంగాణా బీజేపీకి కూడా ఆయన 2023 ఎన్నికలకు ముందు మరోసారి వ్యవహరించారు. ఇంతటి సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర ఉన్న కిషన్ రెడ్డిని బీజేపీ పార్టీ వ్యవహారాలకు పూర్తిగా వాడుకుంటుంది అన్న ప్రచారం సాగుతోంది.

**కీలక మార్పులతో :**

బీజేపీ కీలక మార్పులు చేయబోతోంది అని అంటున్నారు. తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారం అందుకోవాలని బీజేపీ చూస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో చేపట్టబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో బీజేపీ ప్రాతినిధ్యం ఈ రాష్ట్రంలో రెట్టింపు చేయాలని ఆలోచిస్తోంది. ప్రస్తుతం రెండుగా ఉన్న కేంద్ర మంత్రి పదవులను నాలుగు చేయాలని బీజేపీ ఆలోచిస్తో అని అంటున్నారు. అంతే కాదు మహిళ బీసీ కోటాను కూడా అనుసరించి మరిద్దరికి కేంద్ర మంత్రి పదవులు ఇస్తారని అంటున్నారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణకు కేంద్ర మంత్రిగా చాన్స్ ఖాయమని అంటున్నారు. అలాగే మల్కాజ్ గిరీ ఎంపీ ఈటెల రాజేందర్ కి కేంద్ర మంత్రి పదవి తథ్యమని అంటున్నారు. వీరిద్దరితో పాటు కొందరి సేవలను పార్టీ కోసం వినియోగించుకోవాలని చూస్తోంది అని అంటున్నారు.

**పార్లమెంటరీ బోర్డులో :**

ఇక కేంద్ర మంత్రిగా సీనియర్ నేతగా ఉన్న కిషన్ రెడ్డిని బీజేపీ పార్లమెంటరీ బోర్డులోకి తీసుకుంటారు అని అంటున్నారు. తెలంగాణా నుంచి దక్షిణాది నుంచి బీజేపీ ఫోకస్ పెంచేందుకు ఇది ఉపయోగపడుతుందని అంటున్నారు. బీజేపీకి పార్లమెంటరీ బోర్డు చాలా కీలకం అని చెబుతున్నారు. ఎవరికి ఎక్కడ టికెట్ ఇవ్వాలన్నా ఈ అత్యున్నత విధాయక మండలి నిర్ణయిస్తుంది. ప్రధాని సహా కీలక నేతలు అంతా ఉండే ఈ బోర్డులోకి కిషన్ రెడ్డిని తీసుకుంటారు అని అంటున్నారు. దాని ద్వారా రానున్న కాలంలో తెలంగాణా రాజకీయాన్ని మరింత క్లోజ్ గా మోనిటరింగ్ చేస్తారు అని అంటున్నారు. 2028లో జరిగే ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇవ్వాలి అన్నది కూడా ఇంకా బాగా అధ్యయనం చేసేందుకు ఇది దోహదపడుతుందని అంటున్నారు. అలాగే సమర్థులకు పనిమంతులకు టికెట్ ఇవ్వడం ద్వారా వచ్చే ఎన్నికల్లో గెలిచి తీరాలని బీజేపీ వ్యూహ రచన చేస్తోంది.

**గవర్నర్ చాన్స్ ఉందా :**

అంతే కాదు బీజేపీలో ప్రముఖ నేతలలో ఒకరికి గవర్నర్ చాన్స్ కూడా ఇస్తారని అంటున్నారు. దాని వల్ల ఈ ప్రాంతం మీద బీజేపీ మరింతగా శ్రద్ధ చూపిస్తోంది అన్న సందేశం ఇవ్వాలని అనుకుంటోంది. ఇక రానున్న కాలంలో రాజ్యసభ సీటు వంటి పదవులు కూడా తెలంగాణాకు దక్కవచ్చు అని అంటున్నారు. మొత్తం మీద జాతీయ కార్యవర్గంలో చోటు లేదని భావించే చోట తెలంగాణా నుంచి కిషన్ రెడ్డిని పార్లమెంటరీ బోర్డులోకి తీసుకుంటారు అన్న ప్రచారం సాగుతోంది.

# ఫుల్లుగా మందుకొట్టి నీట్ పీజీ పరీక్షకు వచ్చాడు!

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ వ్యాప్తంగా ఆదివారం జరిగిన నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు అభ్యర్థులు సకాలంలోనే కేంద్రాలకు చేరుకున్నారు. అయితే, రంగారెడ్డి జిల్లాలోని ఓ పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి మద్యం సేవించి హల్‌చల్ చేయడం కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలోని పరీక్షా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్ అనే విద్యార్థి సెక్యూరిటీ తనిఖీలను తప్పించుకుని నేరుగా పరీక్ష హాల్‌లోకి ప్రవేశించాడు. లోపల అతని ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటం, అతని నుంచి మద్యం వాసన రావడంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు.

పరీక్ష రాసేందుకు అనర్హుడని నిర్ధారించుకున్న సిబ్బంది అతడిని హాల్ నుంచి బయటకు పంపించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.

ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రిజ్వాన్‌కు బ్రీత్ అనలైజర్ టెస్ట్ నిర్వహించగా, అతను మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మిగతా కేంద్రాల్లో పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.



# కడప వైసీపీ మేయర్... కృష్ణా జిల్లా అల్లుడికి జగన్ గ్రీన్‌సిగ్నల్... ?



**హైదరాబాద్ పెన్ పవర్:** కడప కార్పొరేషన్‌లో ఎలాగైనా విజయం సాధించి, తమ కంచుకోటను కాపాడుకోవాలని వైఎస్సార్‌సీపీ గట్టి పట్టుదలతో ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కడప మేయర్ పదవిపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ కడప మేయర్ స్థానం ఓసీ జనరల్‌కు కేటాయిస్తే, వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసేందుకు పలువురు ఆశావాహులు ఆసక్తి చూపుతున్నారు. వీరిలో వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన డాక్టర్ గోసుల శివభారత్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

కడప నివాసి అయిన డాక్టర్ శివభారత్‌రెడ్డికి వైఎస్సార్ కుటుంబంతో దశాబ్దాల కాలంగా మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. ఆయన సతీమణి సీతారామలక్ష్మి కృష్ణా జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దుట్టా రామచంద్రరావు కుమార్తె. వైఎస్ రాజశేఖరరెడ్డితో దుట్టా కుటుంబానికి సుదీర్ఘ అనుబంధం ఉంది. వైఎస్సార్, దుట్టా ఇద్దరు కలిసి చదువుకున్నారు. ఈ క్రమంలోనే దుట్టాకు జగన్ 2014లో గన్నవరం అసెంబ్లీ టిక్కెట్ కూడా ఇచ్చారు. ఇక దుట్టా అల్లుడు శివభారత్‌రెడ్డి భార్య కాపు (బలిజ) సామాజిక వర్గానికి చెందినవారు. దీంతో కడప నగరంలో గణనీయంగా ఉన్న బలిజ సామాజిక వర్గ ఓటర్ల మద్దతు కూడా ఆయనకు లభించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. శివభరత్ రెడ్డి భార్య ప్రస్తుతం కృష్ణా జిల్లా ఉంగుటూరు వైసీపీ జడ్పీటీసీగా ఉన్నారు. ఇక శివభరత్ రెడ్డికి వైఎస్ జగన్‌తో మంచి స్నేహం ఉండటం, వివాద రహితుడు, విద్యావంతుడు కావడం, స్థానికంగా ఆర్థికంగా స్థితిమంతుడు కావడం డాక్టర్ శివభారత్‌రెడ్డికి రాజకీయంగా పెద్ద కలిసివచ్చే అంశాలు ప్రస్తుతం ఆయన స్థానికంగా మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారని సమాచారం. కడప నగరంలో వైఎస్సార్‌సీపీ ప్రభావం గట్టిగా ఉన్నందున, సరైన అభ్యర్థిని రంగంలోకి దించితే గెలుపు సులువవుతుందని పార్టీ భావిస్తోంది.

రిజర్వేషన్ అనుకూలించడం, జగన్ ఆశీస్సులు ఎలాగూ ఉంటాయన్న ధీమాతో శివభారత్‌రెడ్డి పోటీ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. కడప నగరంలోని డివిజన్ల విభజనపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. ఈ న్యాయపరమైన అంశాలు కొలిక్కి వచ్చిన తర్వాతే ఎన్నికల హడావిడి మొదలవుతుంది.

# అటు కూటమి బలం.. ఇటు జగన్ వార్నింగ్... వాళ్లకు టెన్షన్...?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులలో తీవ్ర ఆందోళనను నింపుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని 16 కార్పొరేషన్ల మేయర్ పదవులతో పాటు, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల ఎంపిక వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జులకు పెద్ద తలనొప్పిగా మారింది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని స్థానిక ఎన్నికల్లో ఢీకొట్టడం అంత తేలికైన విషయం కాదు. అధికార పక్షానికి ఉండే ఆర్థిక బలం, అధికారుల సహకారం, మరియు స్థానిక అభివృద్ధి కోసం అధికార పార్టీకే ఓటేయాలన్న ఆలోచన ఉంటే ప్రజల మనస్సులను డైవర్ట్ చేయడం ఇవన్నీ ఇప్పుడు వైసీపీ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.



ఇక ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అవుతోంది. కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి ఉన్నా స్థానిక ఎన్నికల్లో ప్రత్యర్థిని గెలిపిస్తే తమ పట్టణాలు అభివృద్ధికి దూరమవుతాయని ఓటర్లలో సందేహం ఉంటుంది. అందుకే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం అధికార పార్టీలకే ఉంటుంది. అసలు చాలా చోట్ల ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు పోటీ చేసేందుకే ముందుకు రారు. ఇప్పుడు ఏపీలో కూటమి అంటూ మూడు బలమైన పార్టీలు కలిసి ఉన్నాయి. ఈ కూటమి నేతల సామ, దాన, భేద, దండోపాయాలను తట్టుకుని నిలబడగలిగే బలమైన నేతలు వైసీపీకి దొరకడం కష్టంగా మారింది.

**డైరెక్ట్ ఎలక్షన్ టెన్షన్ :**

ఈసారి మేయర్, మున్సిపల్ ఛైర్మన్ల ఎంపిక ప్రత్యక్ష పద్ధతిలో (డైరెక్ట్ ఎలక్షన్) జరగనుండటంతో చివరి నిమిషం వరకు అధికార పార్టీ నుంచి ప్రలోభాలు, ఒత్తిళ్లు ఉండే అవకాశం ఉంది. వీలైనన్ని స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తుండగా, పోటీ లేకుండా ఏకగ్రీవమైతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీటు ఇచ్చేది లేదని అధినేత జగన్ చేసిన హెచ్చరికలు ఇన్చార్జులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జగన్ ఏకగ్రీవం అయిన నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వను అంటూ ఖరాఖండీగా చెప్పడంతో వైసీపీ ఇన్చార్జ్‌లు పోటీ పెట్టేందుకు అభ్యర్థులను వెతుక్కోవడం, వారికి ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, గెలిపించుకోవడం లాంటి విషయాల్లో సతమతం కానున్నారు.

కొన్ని చోట్ల అభ్యర్థులు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. జగన్ ఏకగ్రీవాల విషయంలో వార్నింగ్‌లు ఇవ్వడంతో కూటమి చాలా ప్రెస్టేజ్‌గా తీసుకుని పులివెందుల లాంటి చోట్లే ఏకగ్రీవాలు చేయాలని పట్టుదలతో ఉంది. ఇక మిగిలిన నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇక పార్టీ కేడర్ అయితే ప్రతిపక్షంలో ఉంటూ సొంత డబ్బులు ఖర్చు పెట్టేందుకు నేతలు వెనుకాడుతున్నారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే అభ్యర్థుల ఎంపిక పూర్తయి, ఎన్నికలు ముగిసే వరకు వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జులకు టెన్షన్ తప్పేలా లేదు.

# బొప్పరాజుపై తిరుగుబాటు..!?

# కాకపుట్టిస్తున్న ఉద్యోగ సంఘాల రాజకీయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు ముసురుకుంటున్నాయా? అన్న చర్చ జరుగుతోంది. ఉద్యోగుల డిమాండ్ల సాధనకంటూ ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మూడు దశల ఉద్యమ కార్యాచరణ ప్రకటించగా, ఆయన తీరును నిరసిస్తూ రెవెన్యూ ఎంప్లాయిస్ యూనియన్, ఏపీ జేఏసీ నేతలు వేర్వేరుగా మీడియాకు ఎక్కడం చర్చనీయాంశం అవుతోంది. ప్రధానంగా ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు రహస్య రాజకీయ అజెండా అమలు చేస్తున్నారని మిగిలిన ఉద్యోగ సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వంతో సానుకూల సహకారాన్ని కోరుకుంటూనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను కించపరిచేలా బొప్పరాజు వ్యాఖ్యలు ఉన్నాయని తప్పుపడుతున్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలపై ఉద్యోగుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చాలా ఆశలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఉద్యోగుల పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపు వంటి ఆర్థికాంశాలుపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. గత రెండేళ్లలో రూ.22 వేల కోట్ల బకాయిల చెల్లింపు, ఒకటో తేదీన జీతాలు, 10 వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చినా ఆర్థిక ప్రయోజనాలు అందజేయడంలో ఇంకా నిర్లక్ష్యం వహిస్తోందని ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అంటూ ఉద్యోగ సంఘాల జేఏసీలు ప్లాన్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా అమరావతి జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గత శుక్రవారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. అయితే ఆ సమావేశానికి హాజరైన వివిధ సంఘాల నేతలు, కొందరు కమ్యూనిస్టు పార్టీల నేతలు ఉద్యోగుల సమస్యలపై కాకుండా, రాజకీయ లక్ష్యాలతో మాట్లాడినట్లు కనిపిస్తోందని రెవెన్యూ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు అనుమానం వ్యక్తం చేస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేయడం సంచలనం రేపుతోంది. ప్రధానంగా అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు లక్ష్యంగా భూపతిరాజు రవీంద్రరాజు చేసిన వ్యాఖ్యలు హీట్ పుట్టిస్తున్నాయి.

బొప్పరాజు ఆధ్వర్యంలోని జరిగిన సదస్సులో కొందరు నాయకులతో బయట నుంచి వచ్చిన స్క్రిప్టు ప్రకారం మాట్లాడించేందుకు ప్రయత్నించారని చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. సీఎం చంద్రబాబును విమర్శించడం, ఆయనపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడమే కాకుండా, సీఎం సతీమణి వ్యాఖ్యలను కూడా వ్యంగ్యంగా స్క్రీన్ పై ప్రదర్శించారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యంతో బాధపడుతుంటే ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని భూపతిరాజు రవీంద్రరాజు మండిపడుతున్నారు. ఇక బొప్పరాజు నిర్వహించిన సదస్సుకు సంబంధం లేకుండా ఉద్యోగుల ?

సమస్యలపై తాము సొంతంగా నిర్ణయం తీసుకుంటామని ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ ప్రకటించారు.

సమస్యల పరిష్కారానికి ముందుగా మంత్రులతో చర్చిస్తామని, అనంతరం ముఖ్యమంత్రితో భేటీ అవుతామని విద్యాసాగర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో అమరావతి జేఏసీతో సంబంధం లేకుండా తాము పనిచేస్తామని ఏపీ జేఏసీ తేల్చిచెప్పినట్లైంది. మరోవైపు బొప్పరాజు ప్రకటించి ఉద్యమ కార్యాచరణతోపాటు ముఖ్యమంత్రిపై విమర్శలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఉద్యోగులు–ప్రభుత్వం మధ్య సఖ్యతను చెడగొట్టేలా బొప్పరాజు వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారని రెవెన్యూ మంత్రి ఆరోపించారు. తాము ఉద్యోగ సంఘాల డిమాండ్లపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ బకాయిలను తమకు అంటగడుతూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొత్తానికి ఈ పరిణామాలతో అమరావతి జేఏసీ ప్రకటించిన మూడు దశల ఉద్యమ కార్యాచరణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని ఆ సమావేశంలో బొప్పరాజు ప్రకటించినప్పటికీ, ఆయన సమక్షంలో కొందరు నేతలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వంతో సంబంధం లేని ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరిపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బొప్పరాజు ప్రకటించిన ఉద్యమంతో తమకు సంబంధం లేదని మిగతా సంఘాల నేతలు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. ఏపీ జేఏసీ కూడా సొంతంగా పనిచేయాలని నిర్ణయించడంతో ఉద్యోగ సంఘాల్లో భిన్నాభిప్రాయాలు స్పష్టమవుతున్నాయని అంటున్నారు.

# ఆ ఉత్తరాంధ్ర నేత ఎవరు? - వైసీపీలో విజయసాయిరెడ్డి సస్పెన్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** విపక్షం వైసీపీలో మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి రాసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. తన లేఖలో వైసీపీ నుంచి బయటకు రావడానికి దారితీసిన కారణాలను స్పష్టం చేయడమే కాకుండా, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిపై విమర్శలు గుప్పించారు విజయసాయిరెడ్డి. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర ఇంచార్జిగా తనను తప్పించడానికి సజ్జలతోపాటు ఉత్తరాంధ్ర నేత ఒకరు కుట్ర చేశారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా ఆ ఉత్తరాంధ్ర నేత ప్రస్తుతం పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నారంటూ లీకులిచ్చారు. విజయసాయిరెడ్డి లేఖలో ఆ ఉత్తరాంధ్ర నేత పేరు రాయకపోవడంతో పార్టీ మారడానికి ప్రయత్నిస్తున్న ఆ నాయకుడు ఎవరంటూ అంతర్గతంగా విస్తృత చర్చ జరుగుతోంది. ఉత్తరాంధ్రకు చెందిన నాయకుడు ఒకరు పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నారంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇచ్చిన లీకు వైసీపీలో హాట్ టాపిక్ అవుతోంది. స్థానిక ఎన్నికల వేళ ఆ ఉత్తరాంధ్ర నాయకుడు ఎవరు అంటూ సాధారణ కార్యకర్తల నుంచి పార్టీ అధిష్టానం పెద్దలు వరకు ఆరా తీస్తున్నారు. పార్టీ అధిష్టానానికి బాగా దగ్గరగా ఉన్న నేత అంటూ విజయసాయిరెడ్డి చెప్పడంతో ఆ నేత మాజీ మంత్రి అయ్యే అవకాశం ఉందని అనుమానిస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు మాజీ మంత్రులు, వారి ప్రస్తుత తీరుతెన్నులను చర్చిస్తూ పార్టీ మారేందుకు ఉన్న అవకాశాలపై ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఆ నేత బొత్స అవ్వొచ్చా?**

పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్న ఉత్తరాంధ్ర నేత అంటూ పేరు చెప్పకుండా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సస్పెన్స్ క్రియేట్ చేయడంతో ఆ నేత బొత్స కావచ్చునేమో అంటూ పలువురు పరిశీలకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఇటీవల వైసీపీ నుంచి జనసేనలో చేరనున్నారంటూ బొత్సపై పలు ఉహాగానాలు వ్యాపించాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి ఎటువంటి ప్రాతిపదిక లేకపోయినా వదంతులు మాత్రం వేగంగా విస్తరించాయి. అయితే ఈ ఊహాగానాలపై బొత్స, ఆయన అనుచరులు స్పందించలేదు. ఊరు, పేరు లేని ప్రచారాన్ని ఖండించాల్సిన అవసరం లేకపోయినా, రాజకీయంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల వల్ల క్లారిటీ ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా ఈ ప్రచారాన్ని నమ్మి బొత్స పేరు ప్రస్తావించకుండా ఆరోపణలు చేశారా? లేక ఇంకెవరైనా నిర్దిష్టమైన నేత పార్టీ మార్పుపై ఆయనకు సమాచారం ఉందా? అన్న విషయంపై క్లారిటీ రావాల్సివుందని అంటున్నారు.

**ఇంకెవరు అవ్వొచ్చు!**

వైసీపీలో విజయసాయిరెడ్డి పనిచేసిన సమయంలో ఆయనే బలవంతుడు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి అత్యంత సన్నిహితుడు. అలాంటి నేతపై చాడీలు చెప్పి, పదవి నుంచి తొలగించేలా చేయగలిగే నాయకుడు ఉత్తరాంధ్రలో ఎవరై ఉంటారనేది విస్తృత చర్చగా ఉంది. ఉత్తరాంధ్రలో వైసీపీ హయాంలో చాలా మంది మంత్రులుగా పనిచేశారు. అందరిలో సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమరనాథ్ మాత్రమే నేరుగా అధిష్టానంతో సంప్రదింపులు జరిపే సత్తా ఉన్నా నేతలుగా చెబుతున్నారు. వీరిలో విజయసాయిరెడ్డికి పొగ పెట్టినంత దమ్ము ఎవరికి ఉంది? అన్నదే పార్టీలో చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. పార్టీని గందరగోళంలోని నెట్టేందుకు విజయసాయిరెడ్డి మైండ్ గేమ్ అడుతున్నారా? లేక నిజంగానే తనను టార్గెట్ చేసిన ఉత్తరాంధ్ర నేతపై అపనమ్మకం కలిగించే వ్యూహంతో లేఖరాశారా అన్నదే తేలాల్సివుందని అంటున్నారు

# మేయర్ సీటుపై కమ్మ నేతల కన్ను ?

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖ మేయర్ అంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనది అన్నది తెలిసిందే. ఏడాదికి అయిదు వేల కోట్ల బడ్జెట్ తో కార్పోరేషన్ నిర్వహణ సాగుతోంది. రానున్న అయిదేళ్లలో ఇది కాస్తా పది వేల కోట్లకు చేరుకుంటుంది అన్నది కూడా ఉంది. అలాగే శివారు ప్రాంతాలలోని గ్రామ పంచాయతీలు మండలాలను విలీనం చేసుకోవడం ద్వారా బృహత్ విశాఖ కార్పోరేషన్ గా అవతరించనుంది. ఇక జీవీఎంసీ పరిధిలోనే దేశంలో అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం అవుతోంది. ఐటీ కంపెనీలు వస్తున్నాయి. అలాగే మిట్టల్ స్టీల్ ప్లాంట్ తో పాటు అనేక పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. దాంతో జీవీఎంసీ ఆర్థికంగా అన్ని విధాలుగా ముందుకు దూసుకుని పోయే అవకాశాలు ఉన్నాయి అని అంటున్నారు. కూటమి ప్రభుత్వానికి విశాఖ మీద ఫోకస్ ఉంది. ప్రత్యేకించి టీడీపీ విశాఖను ఆర్థిక పారిశ్రామిక రాజ్ధానిగా భావిస్తోంది. ఆ విధంగానే అభివృద్ధి చేస్తోంది.

**టీడీపీ టార్గెట్ :**

విశాఖ మేయర్ సీటుని 1987లో టీడీపీ దక్కించుకుంది. ఆనాడు డీవీ సుబ్బారావు ఎన్నిక అయ్యారు. అది ప్రత్యక్ష ఎన్నికలలోనే జరిగింది. అయిదేళ్ల పాటు ఆనాటి పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ రోజుకీ చెప్పుకుంటారు. ఇక ఆనాటి నుంచి మళ్ళీ మేయర్ సీటు టీడీపీకి దక్కలేదు. 2025 లో వైసీపీ మేయర్ మీద అవిశ్వాసం ప్రవేశపెట్టి ఒక ఏడాది మాత్రం టీడీపీ పాలన చేసింది. ఈసారి అలా కాదు పూర్తి కాలం తాము అధికారంలో ఉంటే విశాఖకు ఒక రూపు షేపూ తీసుకుని రావచ్చు అని పసుపు పార్టీ ఆలోచిస్తోంది. దాంతో విశాఖ మేయర్ సీటు టీడీపీకే దక్కుతుందన్నది అందరికీ తెలిసిపోయింది. దాంతో టీడీపీలోనే పెద్ద ఎత్తున పోటీ ఏర్పడుతోంది.

**కమ్మ నేతల చూపు :**

విశాఖ మేయర్ గా ఇప్పటిదాకా చూస్తే రెడ్డి, బ్రాహ్మణ, వెలమ, యాదవ, మత్స్యకార,, గవర సామాజిక వర్గాలకు చెందిన వారు పనిచేశారు. ఈసారి ఇతర సామాజిక వర్గాలకు కూడా అవకాశం ఇవ్వాలని డిమాండ్ పెరుగుతోంది. మేయర్ గా కాపులకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎందుకంటే ఎక్కువ జనాభాగా వారు ఉన్నారని గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో కమ్మ సామాజిక వర్గం నేతల నుంచి ఈసారి అనూహ్యంగా రేసులో చాలా పేర్లు వినిపిస్తున్నాయి. దాంతో విశాఖ మేయర్ సీటు ఎవరికి దక్కుతుందన్నది టీడీపీలో తీవ్ర స్థాయిలో చర్చ సాగుతోంది.

**వీరంతా పోటీకి :**

కమ్మ సామాజిక వర్గం నుంచి విశాఖ జిల్లా టీడీపీ ప్రెసిడెంట్ గా ఉన్న చోడె వెంకట పట్టాభిరాం పోటీలో ఉంటారని ప్రచారం ఊపందుకుంది. ఆయన కొద్ది నెలల క్రితం కీలకమైన పార్టీ పదవిని అందుకున్నారు. దాంతో పాటు రుషికొండ వెంకటేశ్వర స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ గా నామినేటెడ్ పదవిని అందుకున్నారు. ఆయన గతంలో జీవీఎంసీలో కార్పోరేటర్ గా పనిచేయడమే కాదు టీడీపీ తరఫున ఫ్లోర్ లీడర్ గా పనిచేశారు. దాంతో ఆయనకు జీవీఎంసీ పాలనా వ్యవహారాల మీద పూర్తి అవగాహన ఉందని అంటున్నారు. దాంతో ఆయన పేరుని రేసులో ముందుకు తెస్తున్నారు. ఆయన కూడా సుముఖంగా ఉన్నారని అంటున్నారు. ఆయన అభ్యర్థిత్వం పట్ల టీడీపీ పెద్దలు సానుకూలంగా ఉంటారని కూడా మాట వినిపిస్తోంది.

**ఆయన చూపు మేయర్ సీటు మీద :**

అలాగే విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కూడా తన కుమారుడుని మేయర్ సీటు కోసం ముందు వరసలోకి తెస్తున్నారు అని అంటున్నారు. ఇప్పటికే యువ నేతగా ఉన్న ఆయన విశాఖ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా పోటీకి దిగుతారు అని ప్రచారం ఉంది. కానీ ఇపుడు ఆయన చూపు మేయర్ సీటు మీద పడింది అని అంటున్నారు. సీనియర్ నేతగా ఉన్న వెలగపూడికి మంత్రి పదవి అయితే దక్కాల్సి ఉంది. కానీ సామాజిక సమీకరణలో ఇవ్వలేకపోయారు. దాంతో ఆయన కుమారుడికి మేయర్ సీటు ఇస్తారా అన్న చర్చ అయితే సాగుతోంది. వీరిద్దరితో పాటు మరికొందరు కమ్మ నేతల చూపు కూడా విశాఖ మేయర్ సీటు మీద ఉంది. అయితే విజయవాడ మేయర్ సీటును బట్టి ఇక్కడ అభ్యర్థి నిర్ణయం టీడీపీ చేస్తుంది అని అంటున్నారు. విజయవాడ మేయర్ సీటు కాపులకు ఇస్తే విశాఖ కమ్మలకు ఇస్తారని కూడా అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారం ఏ మేరకు నిజం అవుతుంది అన్నది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# నాలుగు గోడల మధ్య జిమ్ దాటి.. పార్టీ స్పేస్‌లోకి ఫిట్‌నెస్ !



నాలుగు గోడల జిమ్, హెడ్‌ఫోన్స్ తగిలించుకుని ఒంటరిగా చేసే వర్క్?అవుట్స్.. ఈ పాత పద్ధతికి నేటి యువత మెల్లగా గుడ్‌బై చెప్తోంది. వ్యాయామం అంటే కేవలం చెమట కార్చడం మాత్రమే కాదు, అదొక సరికొత్త వేడుక అని నమ్ముతోంది. అందుకే ఇప్పుడు ఫిట్‌నెస్ అనేది జిమ్‌ల పరిమితులను దాటి క్లబ్బులు, మాల్స్, రెస్టారెంట్లు, పూల్‌సైడ్ వేదికల్లోకి అడుగుపెట్టింది.ఉదయం స్పిన్నింగ్, పైలేట్స్, యోగా, హెచ్‌ఐఐటీ వంటి కఠినమైన వ్యాయామాలు చేయడం, సాయంత్రానికి డీజే మ్యూజిక్, డ్యాన్స్, ఆరోగ్యకరమైన ఆహారంతో కలిసి 'వర్క్?అవుట్ పార్టీలు' జరుపుకోవడం సరికొత్త లైఫ్‌స్టైల్ ట్రెండ్‌గా మారుతోంది.సాధారణంగా జిమ్‌లో ఒంటరిగా వర్క్?అవుట్ చేయడం వల్ల కొద్దిరోజులకే బోర్ కొట్టే అవకాశం ఉంది. కానీ ఇలాంటి గ్రూప్ వర్కౌట్స్‌లో లభించే కమ్యూనిటీ అనుభూతి యువతను ఎంతగానో ఆకట్టుకుంటోంది. డీజే మ్యూజిక్, లైవ్ సాంగ్స్ ఇచ్చే ఎనర్జీ మధ్య అందరితో కలిసి నవ్వుతూ, మాట్లాడుకుంటూ వ్యాయామం చేస్తున్నప్పుడు శ్రమ అస్సలు తెలియదు. తోటివారి ఉత్సాహాన్ని చూసి మరింత బాగా చేయాలనే మోటివేషన్ ఇక్కడ సహజంగానే లభిస్తుంది.ఇప్పుడు ఫిట్‌నెస్ అనేది కేవలం బరువు తగ్గడానికో, కండలు పెంచడానికో మాత్రమే పరిమితం కాలేదు. అదొక సామాజిక అనుభవంగా రూపాంతరం చెందింది. ఒత్తిడితో కూడిన ఉరుకులు పరుగుల జీవితంలో యువత కొత్త వ్యక్తులను కలవడానికి, నెట్‌వర్కింగ్ పెంచుకోవడానికి ఇలాంటి వాటిని వేదికలుగా చేసుకుంటోంది. వీకెండ్స్‌లో పబ్‌లకు వెళ్లి ఆరోగ్యం పాడుచేసుకునే కంటే, ఇలా హెల్దీగా 'వర్క్?అవుట్ పార్టీలు' చేసుకోవడం ఉత్తమమని భావిస్తున్నారు.వ్యాయామం ముగిశాక సోషల్ మీడియా కోసం గ్రూప్ ఫొటోలు దిగడం, ఆర్గానిక్ జ్యూస్‌లు తాగుతూ ముచ్చటించడం నేటి జనరేషన్‌కు ఒక సామాజిక హోదాగా మారింది. శారీరక శ్రమను సామాజిక ఆనందంతో ముడిపెట్టడమే ఈ సరికొత్త ట్రెండ్ అసలు రహస్యం.

# "మానిఫెస్టేషన్".. మనసు దారి మార్చే చిన్న అలవాటు.. ఉదయం లేవగానే ఐదు నిమిషాలు ఏం చేయాలంటే..




ఉదయం లేవగానే చాలామంది మొదటగా ఫోన్ చేతిలోకి తీసుకుంటారు. కానీ "మానిఫెస్టేషన్"పై నమ్మకం పెట్టుకునే కొందరు మాత్రం ఆ మొదటి ఐదు నిమిషాలను తమ లక్ష్యాలకు కేటాయిస్తారు. మనోవిజ్ఞానం దృష్టిలో ఇవి కేవలం కొత్త ఆలోచనలు కాదు, రోజంతా మన దృష్టి ఎటు వెళ్లాలో నిర్ణయించే చిన్న సాధనం. ఉదయం లేవగానే ఐదు నిమిషాలు తమకు ఏం కావాలో స్పష్టంగా మనసులో పెట్టుకుంటారు. అది ఇప్పటికే జరిగిపోయినట్టుగా ఊహిస్తారు. ఆ అనుభూతిని కాసేపు మనసులో నిలుపుకుంటారు. కొందరు అదే లక్ష్యాన్ని రాసుకుంటారు. మరికొందరు ఆ రోజులో లక్ష్యానికి దగ్గర చేసే ఒక్క చిన్న పని ఏదో నిర్ణయిస్తారు. ఇక్కడే అసలు విషయం మొదలవుతుంది. మన మెదడులో ఉన్న రెటిక్యులార్ యాక్టివేటింగ్ సిస్టమ్ (ఆర్?ఎఎస్), అంటే బయట నుంచి వచ్చే సమాచారం అంతా ఒకేలా తీసుకోదు. అవసరమైనది ఏది? అవసరం లేనిది ఏది? అని ఫిల్టర్ చేస్తుంది.మనం ఏ లక్ష్యంపై దృష్టి పెడితే, ఆ లక్ష్యానికి సంబంధించిన సూచనలు, అవకాశాలు, పరిచయాలు ఎక్కువగా దృష్టిలో పడతాయి. మన చుట్టూ ఏమీ మారకపోయినా, మనసు వాటిని గమనించే తీరు మారిపోతుంది. దీనిని ఫ్రీకెన్సీ ఇల్యూషన్? లేదా బాడర్-- మైన్‌హోఫ్ ఫినామినాతో కూడా పోలుస్తున్నారు. అంటే ఒక విషయాన్ని కొత్తగా తెలుసుకున్న తర్వాత, అదే విషయం చుట్టూ తరచుగా కనిపిస్తున్నట్లు అనిపించే మానసిక ప్రభావం.

### ఉదాహరణలతో తెలుసుకుందాం

ఒక వ్యక్తి కొత్తగా ఎరుపు రంగు కారు కొనాలని అనుకుంటున్నాడని అనుకుందాం. ఆ కారు గురించి ఇంటర్నెట్‌లో చూస్తాడు, వీడియోలు చూస్తాడు, వివరాలు తెలుసుకుంటాడు. ఆ తర్వాత రోడ్డుపైకి వెళ్లినప్పుడు, అదే మోడల్‌కు చెందిన ఎరుపు కార్లు ఎక్కడ చూసినా కనిపిస్తున్నట్లు అనిపిస్తుంది. నిజానికి ఆ కార్లు అప్పుడే కొత్తగా రాలేదు. ఇంతకుముందు కూడా అవి రోడ్లపై తిరుగుతున్నాయి. కానీ అతని మెదడు ఇప్పుడు ఆ కారు మీదే దృష్టి పెట్టడంతో వాటిని ఎక్కువగా గుర్తించడం ప్రారంభించింది. దీనినే "పునరావృత దర్శన భ్రమ" అని చెప్పొచ్చు. మరో ఉదాహరణ.. మీరు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని అనుకుందాం. ప్రతిరోజూ ఆ పరీక్ష గురించే ఆలోచిస్తున్నారు. అకస్మాత్తుగా ఎక్కడ చూసినా ఉద్యోగ ప్రకటనలు, కోచింగ్ సెంటర్ల ప్రకటనలు, పరీక్షలకు సంబంధించిన వార్తలు, వీడియోలు ఎక్కువగా కనిపిస్తున్నట్లు అనిపిస్తుంది. అవి కొత్తగా రావడం కాదు. మీ లక్ష్యంపై మీ దృష్టి కేంద్రీకృతం కావడంతో, వాటిని మీ మెదడు ముందుకంటే ఎక్కువగా గుర్తిస్తోంది. ఇదే పునరావృత దర్శన భ్రమ (ఫ్రీక్వెన్సీ ఇల్యూషన్).

### చివరికి పని చేయాల్సింది మనమే

ఇది కేవలం ఊహించడమే కాదు. ఆలోచనకు తోడు చర్య కూడా ఉండాలి. ఉదయం ఐదు నిమిషాలు లక్ష్యాన్ని గుర్తుచేసుకుని, ఆ తర్వాత దానికి తగ్గ చిన్న పనులు చేయడం వల్లే ఈ అలవాటు నిజమైన ఫలితం ఇస్తుంది. కాబట్టి మానిఫెస్టేషన్‌ను ఒక అద్భుత శక్తిగా కాకుండా, మనసును సరిచేసి, అవకాశాలను పట్టుకునే శిక్షణగా చూడాలి. అప్పుడు మాత్రమే రోజూ కనిపించే చిన్న సంకేతాలు పెద్ద మార్పుల దిశగా దారితీయగలవు. ఇలాంటి ఆలోచనలు ఉదయం పూట చేయడం వల్ల మనసు ఆహ్లాదకరంగా నిర్ణయాత్మకంగా ఉంటుంది.

### మాయ కాదు, దృష్టి మార్పు

మానిఫెస్టేషన్‌ను "అవసరమైనది ఆకర్షించడం" కంటే, "అవసరమైనదాన్ని గుర్తించే ఫోకస్? పెరగడం" గా చూడటం సరైంది. ఇది ఆలోచనలపై మాత్రమే కాదు, ప్రవర్తనపై కూడా ప్రభావం చూపుతుంది. లక్ష్యం స్పష్టంగా ఉన్నప్పుడు నిర్ణయాలు మరింత నమ్మకంగా తీసుకోవడం, సందేహాలు తగ్గించడం, అవకాశానికి వెంటనే స్పందించడం ఈజీ అవుతుందని మనోవిజ్ఞాన కోణం చెప్తోంది. సానుకూల భావనలు సమాచారాన్ని అర్థం చేసుకోవడంలో, నిల్వ చేయడంలో మెదడుకు సాయపడతాయి.

# ఫ్రూట్ సిటీస్.. ప్రతి నగరానికీ పండ్ల పేరుతో ఒక ప్రత్యేకమైన.. 'ముద్దు పేరు' ఉందని మీకు తెలుసా ?




దేశంలో వివిధ పండ్ల సాగుకు పేరొందిన ప్రాంతాలను ఆయా పండ్ల సిటీ పేర్లతో పిలుస్తున్నారు. వివిధ పండ్ల సాగు, ఉత్పత్తి అధికంగా జరగడంతో పాటు నాణ్యత గల పండ్లను అందించడంలో ప్రాధాన్యమున్న నగరాలు, ప్రాంతాలు ఆయా పండ్లకు రాజధానులుగా పేరొందాయి. దేశంలో వందలాది నగరాలు ఉన్నాయని, వాటిలో ప్రతి నగరానికీ దానికంటూ ఒక ప్రత్యేకమైన 'ముద్దుపేరు' ఉందని మీకు తెలుసా ? ఏమిటీ ఈ పండ్ల రాజధానుల ప్రాధాన్యం, వాటి విశిష్ఠత గురించి తెలుసుకుందాం.

### 1. మామిడి నగరం.. మాల్దా

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మాల్దా నగరాన్ని భారతదేశపు మామిడి నగరంగా పిలుస్తారు. కోల్‌కతాకు విమానంలో చేరుకుని అక్కడినుంచి ఆరు గంటల రైలు, రోడ్డు మార్గాల ద్వారా మాల్దాకు చేరుకోవచ్చు. ఇంతటి ఘనత దక్కించుకున్న మాల్దా నగరం వేసవి కాలంలో మామిడి పండ్లకు స్వర్గధామంగా మారుతోంది.
పండిన మామిడి పండ్ల సువాసన గాలిలో నిండి, సందర్శకులను ఆకర్షిస్తుంది. ఈ మామిడి నగరంలో మే నెలలో చెట్లపైనే పండిన తాజా మామిడి పండ్లను కోసుకొని తినొచ్చు. ఈ నగరం కేవలం దాని మామిడి దిగుబడికే కాకుండా, దాని నాణ్యత, వారసత్వానికి కూడా ప్రసిద్ధి చెందింది.ఇక్కడ పండుతున్న ఫజ్లీ, హిమ్‌సాగర్, లక్ష్మణ్‌భోగ్ వంటి ప్రసిద్ధ మామిడి రకాలకు దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా మంచి గిరాకీ ఉంది. మామిడి సాగుకు అనువైన ఈ ప్రాంతంలోని సారవంతమైన ఒండ్రుమట్టి, తేమతో కూడిన వాతావరణం ఉంది.అంతేకాకుండా తరతరాలుగా రైతులు ఈ తోటలను సాంప్రదాయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. ఇక్కడ మామిడి కేవలం ఒక పండు మాత్రమే కాదు, అది జీవనోపాధికి, సాంస్కృతిక గుర్తింపునకు మూలం. పొలాల్లో పనిచేసే ప్రజలు, మామిడి పండ్లను కోసే కూలీలు, వాటిని వేరుచేసి రవాణా చేయడానికి చేసే సన్నాహాలు అన్నీ చూడముచ్చటగా ఉంటాయి.

### 2. భారతదేశపు అరటి రాజధాని.. జల్గావ్

భారతదేశపు అరటి రాజధాని బిరుదు మహారాష్ట్రలోని జల్గావ్‌కు దక్కుతుంది. ఈ జిల్లా తన అసాధారణమైన అరటి ఉత్పత్తి, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, సారవంతమైన నేల, ఆధునిక వ్యవసాయ పద్ధతుల కారణంగా జాతీయ గుర్తింపును పొందింది. జల్గావ్ జిల్లా మహారాష్ట్ర మొత్తం అరటి సాగు విస్తీర్ణంలో 69 శాతం వాటాను కలిగి ఉంది. జల్గావ్ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు అరటి సాగుకు వెన్నెముకగా నిలుస్తుంది. ఇది వేలాది మంది రైతులకు, రవాణా, ప్యాకేజింగ్, నిల్వ, వాణిజ్యంలో పాలుపంచుకునే సంబంధిత పరిశ్రమలకు మద్దతునిస్తుంది.
టిష్యూ కల్చర్ ఫార్మింగ్, డ్రిప్ ఇరిగేషన్, శాస్త్రీయ పంట నిర్వహణ పద్ధతులు వంటి ఆధునిక వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అవలంబించడం కూడా ఈ జిల్లా విజయానికి దోహదపడింది. పలు నాణ్యమైన అరటి రకాలను ఉత్పత్తి చేయడంలో ప్రసిద్ధి చెందింది. జల్గావ్ అరటిపండ్ల భౌగోళిక మూలాన్ని గుర్తించి జీఐ ట్యాగ్ ఇచ్చారు.

### 3. చాక్లెట్ టౌన్.. ఊటీ

తమిళనాడులోని నీలగిరి కొండల్లో ఉన్న అందమైన పర్వత ప్రాంతం ఊటీ. భారతదేశపు చాక్లెట్ టౌన్‌గా ప్రసిద్ధి చెందింది? తియ్యగా ఉండే చాక్లెట్ అంటే అందరూ ఇష్టపడుతుంటారు. దీన్ని ఉష్ణమండల వాతావరణంలో చెట్లపై పెరిగే కోకో గింజల నుంచి తయారు చేస్తారు. చాక్లెట్ తయారు చేయడానికి, ఈ గింజలను పులియబెట్టి, ఎండబెట్టి, వేయించడం ద్వారా వాటిలోని గొప్ప రుచిని బయటకు తీసుకొస్తారు. ఊటీ చల్లని వాతావరణం చాక్లెట్లను తాజాగా, నిగనిగలాడేలా ఉంచడంలో సాయపడుతుంది. ఈ సంప్రదాయం బ్రిటిష్ కాలంలో ప్రారంభమై, వందకు పైగా కుటీర పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ఊటీలో డార్క్, మిల్క్ రకాల నుంచి స్థానికంగా వేయించిన నట్స్‌తో చేసిన చాక్లెట్లు లభిస్తాయి.

### 4. పైనాపిల్ రాజధాని.. వజకుళం

కేరళలోని ఎర్నాకులం జిల్లాలో ఉన్న వజకుళం భారతదేశపు పైనాపిల్ రాజధానిగా పేరొందింది. ఇక్కడ పండే పైనాపిల్ అధిక మొత్తంలోనే కాకుండా, అత్యుత్తమ నాణ్యతతో కూడా ఉంటాయి. తీపి, మంచి సువాసన, రసభరితంగా ఉండే ఈ పండ్లు ఈ ప్రాంతం ఖ్యాతిని పెంచాయి.
వజకుళం రైతులు పైనాపిల్?తో ఏటా వేల టన్నుల దిగుబడిని సాధిస్తారు. ఉత్పత్తి సీజన్‌లో ఈ పట్టణం పూర్తిగా సందడిగా మారుతుంది. తాజా పండ్లతో నిండిన ట్రక్కులు నిరంతరం భారతదేశంలోని వివిధ మార్కెట్లకు తరలిస్తుంటారు.
జీఐ ట్యాగ్ పొందిన వజకుళం మారిషస్ రైతులు బంగారు-పసుపు రంగులో, అద్భుతమైన రుచితో ఉంటుంది. కేరళలోని వర్షపాత సరళి, సారవంతమైన నేల పైనాపిల్ పంటకు అత్యంత అనుకూలమైన పరిస్థితులను కల్పిస్తాయి. ఈ ప్రాంతం కేవలం తాజా పండ్లను మాత్రమే ఉత్పత్తి చేయదు. రైతులు జ్యూస్, జామ్, క్యాండీ, స్క్వాష్, ఊరగాయలతో ప్రాసెసింగ్ రంగం కూడా పురోగతి చెందింది.

### 5. భారతదేశపు ఆలుగడ్డల రాజధాని.. ఆగ్రా

బంగాళాదుంప భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన కూరగాయల్లో ఒకటి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాను భారతదేశపు ఆలుగడ్డల ఉత్పత్తి, నిల్వ, వ్యాపారానికి ప్రముఖ కేంద్రంగా పిలుస్తారు. తాజ్ మహల్?కు ప్రపంచ ప్రసిద్ధి చెందడంతో పాటు, ఈ నగరం ఆలుగడ్డ సాగు, నిల్వ, పంపిణీకి ఒక ముఖ్యమైన కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడి సారవంతమైన నేల, సమశీతోష్ణ వాతావరణం కారణంగా ఈ ప్రాంతం పెద్ద ఎత్తున ఆలుగడ్డ సాగుకు అనుకూలంగా ఉంది. **ఆగ్రాలో కోల్డ్ స్టోరేజీ, టోకు మార్కెట్లు, విస్తృతమైన వ్యవసాయ క్షేత్రాల నెట్‌వర్క్‌తో సహా అభివృద్ధి చెందిన వ్యవసాయ మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఆలుగడ్డలను సమర్థవంతంగా నిల్వ చేయడానికి, పంపిణీ చేయడానికి రైతులకు సాయపడతాయి. ఆలుగడ్డలను స్నాక్స్, కూరలు, వీధి ఆహారం, ఫాస్ట్ ఫుడ్ వంటి అనేక భారతీయ వంటకాలలో ఉపయోగిస్తారు.**


### 6. కాటన్ సిటీలు.. అకోలా, యావత్మాల్

మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతానికి చెందిన అకోలా, యావత్మాల్ నగరాలు భారతదేశపు కాటన్ సిటీలుగా బిరుదును పొందాయి. అకోలా, యావత్మాల్ నగరాల చుట్టూ ఉన్న సారవంతమైన నల్లరేగడి మట్టి భూములు పత్తి సాగుకు అత్యంత అనుకూలమైనవి. ఈ నగరాలు ఒక ప్రధాన ప్రాసెసింగ్ , వాణిజ్య కేంద్రాలుగా కూడా మారాయి.
పత్తి పీచును గింజల నుంచి వేరు చేసే జిన్నింగ్ యూనిట్లు ఈ ప్రాంతం అంతటా విస్తరించి ఉన్నాయి. ఈ జిల్లాలు భారతదేశ వస్త్ర సరఫరా వ్యవస్థకు ముడి సరుకును అందిస్తాయి. చారిత్రక కాలం నుంచే ఈ నగరాలు పత్తి భారీ స్థాయిలో పండిస్తున్నాయి. నూనె, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు కూడా కీలక మార్కెట్‌గా మారాయి.

### 7. ఫ్లవర్ పాట్ ఆఫ్ ఇండియా.. గుండ్లుపేట

గాలికి మెల్లగా ఊగుతున్న బంగారు రంగు పొద్దుతిరుగుడు పువ్వులు, పువ్వులు, లేత గులాబీలతో నిండిన విశాలమైన క్షేత్రాల మధ్య ఉన్న రహదారిపై ప్రయాణిస్తుండేవాళ్లు మైమరచిపోతుంటారు. కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లా గుండ్లుపేట ఫ్లవర్ పాట్ ఆఫ్ ఇండియాగా పేరొందింది.
మైసూరు నుంచి 60 కిలోమీటర్లు, బెంగళూరు నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండ్లపేట కర్ణాటకను ఊటీ, వయనాడ్‌లతో కలిపే ప్రముఖ రహదారిపై ఉంది. తమ ప్రయాణంలో సుందరమైన దృశ్యాలను చూస్తూ విరామం తీసుకోవాలనుకునే యాత్రికులకు ఇది ఒక ఆదర్శవంతమైన విడిది కేంద్రంగా నిలుస్తుంది.
గుండ్లుపేట పూలతోటలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పొద్దుతిరుగుడు, బంతి, గులాబీ, ఇతర కాలానుగుణ పూల క్షేత్రాలు అద్భుతమైన దృశ్యాలను సృష్టిస్తాయి. జూన్, ఆగస్టు మధ్య ఉండే పూల సీజన్‌లో ఈ ప్రాంతం ఒక రంగుల చిత్రపటంలా మారిపోతుంది.
అందుకే ఇది ఫొటోగ్రాఫర్లు, రోడ్ ట్రిప్స్ చేసేవారికి ఇష్టమైన ప్రదేశంగా మారింది. ఈ పూల క్షేత్రాలు కర్ణాటకలో 'ఇన్‌స్టాగ్రామ్'లో పంచుకోవడానికి అత్యంత అనువైన ప్రదేశాలలో ఒకటిగా నిలిచాయి. చాలా మంది స్థానిక రైతులు ప్రవేశ రుసుముతో సందర్శకులను తమ తోటల్లోకి అనుమతిస్తారు.

# ఈర్ష్య, అసూయలు మనిషిని మృగంలా మారుస్తాయి.. ఈ నీతి కథలో ఒంటెలా బతకండి.. నక్కలా కాదు !



మనుషులు రెండే రెండు తెగలు. ఈగలు -- తేనెటీగలూనూ. తేనెటీగలెప్పుడూ పువ్వుల మీదికే పోతాయి. పువ్వు మీద వాలి తేనె గ్రహించి వెళ్లిపోతాయి. అంతచేసినా పువ్వు నలగదు. రేకులూడవు. ఇదొక తరహా. ఈ తరహా మనుషులు మంచి వైపే, మంచి కోసమే, మంచిగానే పోతారు. ఇంక ఈగలున్నాయే ఇవి కురుపు మీద వాలి కెలుకుతాయి. మురికి మీద తిరుగుతూ కులుకుతాయి. ఇదంతా వాటికాహారం. కొంతమంది మనుషులూ అంతే! వారెప్పుడూ కుళ్లుతో ఉంటారు. కుళ్లు కోసమే చూస్తారు. వారికి మంచి కనిపించదు.

కనిపించిన మంచి మీద కుళ్లు పోస్తారు. మంచితనాన్ని వంచించడానికి నిరంతరం ఈగలు ప్రయత్నిస్తుంటాయి. ప్రపంచంలో ఈగల సంఖ్య హెచ్చు. తేనెటీగలు తక్కువ" (ఉషశ్రీ రచించిన 'పెళ్లాడేబొమ్మా!' నవలా లేఖావళి 23వ పేజీ నుండి). కొంతమంది మానవులు ఈర్ష్య, అసూయలను జయించలేరు. వాటిని జయించిననాడు మనిషి భగవంతుడవుతాడు. ఇతరులు... సంపన్నులయినా, ఉన్నత స్థాయికి వెళ్లినా అసూయతో రగిలిపోతుంటారు. గెలుపొందినవారిని ఏదో ఒకవిధంగా చెడ్డవారిగా చూపడానికి ప్రయత్నిస్తుంటారు.పాండవులు రాజసూయ యాగం చేసే సమయంలో సామంతులందరినీ ఓడించి, సంపదలు సముపార్జించి, యాగ సమయంలో దానం చేశారు. ఆ సంపదలు చూసిన దుర్యోధనాదులలో అసూయ బయలుదేరింది. ఏదో ఒకవిధంగా పాండవుల సంపదలను హరించాలనే దురాలోచన బయలుదేరింది. శకుని సాయంతో పాండవులను జూదానికి పిలిచి, వానితో కపట జూదం ఆడి, పాండవుల సకల సంపదలను హరించి, వారిని అడవుల పాలు చేశాడు దుర్యోధనుడు. పదమూడు సంవత్సరాలు పూర్తయ్యాక వచ్చి, వారి రాజ్యం వారు స్వీకరించవచ్చునని పలికాడు. కాని దుర్యోధనునిలో ఈర్ష్య, అసూయలు కొద్దిమాత్రం కూడా తగ్గలేదు.అజ్ఞాతవాస సమయంలో వారిని ఏదో ఒక విధంగా గుర్తించి, తిరిగి మరో పదమూడు సంవత్సరాలు అడవులపాలు చేయడానికి ఎంతో ప్రయత్నించాడు. ఉత్తర గోగ్రహణం పేరుతో వారిని బయటకు రప్పించాడు. అయితే ఆ రోజుతో అజ్ఞాతవాసం ముగిసిందని దుర్యోధనుడికి తెలియదు. అందుకే 'యతో ధర్మస్తతో జయః' ఎక్కడ ధర్మం ఉంటుందో, అక్కడ విజయం ఉండి తీరుతుంది అని పలికాడు వ్యాసుడు.
అనగనగా ఒక ఊరిలో ఒక నక్క, ఒక సింహం, ఒక ఒంటె ఉంటున్నాయి. సింహానికి ఒంటె మీద ప్రీతి ఎక్కువ. దానితో చాలా సన్నిహితంగా ఉండేది. అది చూసిన నక్క ఈర్ష్యతో రగిలిపోయింది. ఎలాగైనా ఒంటెను చంపించాలని ఎత్తువేసింది. ఒంటె లేని సమయంలో సింహం దగ్గరకు వెళ్లి, ఒంటెమీద ఎన్నో నేరాలు చెప్పింది. సింహానికి నక్కజిత్తులు తెలుసు కనుక, నక్క ఏం మాట్లాడినా సింహం మారు మాట్లాడలేదు. నక్కకు ఏదో ఒక విధంగా బుద్ధి చెప్పాలనుకుంది.ఒకరోజు ఒంటెను, నక్కను రెండింటినీ పిలిచి, 'మీకు నేను ఒక పరీక్ష పెడతాను. ఆ పరీక్షలో నెగ్గినవారికి ఒక బహుమతి ఇస్తాను' అని చెప్పింది. నక్క, 'ఎలాగూ నేనే గెలుస్తాను' అని లోలోపలే సంతోషపడింది. 'ఈ చెట్టు కనిపిస్తోంది కదా. ఆ చెట్టు కొమ్మన ఉన్న పండుని ఎవరు ముందుగా కోసి నాకు ఇస్తారో వారే ఈ పందెంలో గెలిచినట్లు' అని ప్రకటించింది. 'ఓస్ అంతేగా, గబగబ చెట్టు ఎక్కి పండు కోసేస్తాను..' అనుకుంటూ చెట్టు మీదకు ఎక్కడానికి ప్రయత్నించింది.ఒంటె స్వయంగా ఎత్తుగా ఉండటమే కాకుండా, దాని మెడ కూడా చాలా పొడవు కాబట్టి, ఒక్కసారి తన తల ఎత్తి, క్షణకాలంలో పండుని కోసి, సింహానికి బహుమతిగా ఇచ్చింది. అది చూసిన నక్కలో మరింత అసూయ బయలుదేరింది. అప్పుడు సింహం, 'నక్కబావా! నీకున్న తెలివితేటలు ఇతరులకు లేవని నీకు తెలుసు. కాని నీ తెలివితేటలను మంచికి ఉపయోగించాలే కాని, ఇతరుల మీద నేరాలు చెప్పడానికి ఉపయోగించకూడదు. ఒంటె ఒక్కనాడూ నీ మీద నేరాలు చెప్పలేదు.ఎప్పుడూ నీ తెలివితేటల గురించి ఎంతో చక్కగా పొగుడుతుంది. నీలోని ఈ గుణాన్ని విడిచిపెట్టకపోతే, నీ నాశనానికి నువ్వే కారణమవుతావు. ఈ పోటీలో గెలిచిన ఒంటెను నా ప్రధాన అనుచరునిగా నియమిస్తున్నాను. నువ్వు కూడా నీలో మార్పు తెచ్చుకుని, నా దగ్గర మరో మంత్రిగా చేరు' అని పలికింది. నక్క సిగ్గుతో తల దించుకుంది. ఈర్ష్య, అసూయలు మనిషిని మృగంలా మారుస్తాయి. వారి నాశనానికి కూడా కారణమవుతాయి.

# మోసకారి తోడేలును చిత్తు చేసిన తెలివైన జింకలు.. పిల్లలకు చెప్పాల్సిన నీతి కథ అంటే ఇది..!



ఒక దట్టమైన అడవిలోని ఎత్తైన కొండ ప్రాంతంలో ఒక జింకల మంద నివసిస్తూ ఉండేది. ఆ మందకు వయసు పైబడిన దుప్పి నాయకుడిగా ఉండేది. వయసు భారంతోపాటు క్రూర జంతువుల నుంచి తన మందను ప్రతిరోజూ కాపాడుకోవడం ఆ నాయకుడికి రోజురోజుకూ తలకు మించిన భారంగా మారింది.

సరిగ్గా అదే అడవిలో ఒక ముసలి తోడేలు ఉండేది. దానికి కూడా వయసు పైబడటంతో చూపు మందగించి, వేటాడే శక్తి తగ్గిపోయింది. దాంతో కష్టపడకుండా, సులువుగా ఆహారం సంపాదించుకోవడానికి ఆ జింకల మందపై కన్ను వేసింది. ?ఒకరోజు ఆ తోడేలు ఎంతో వినయాన్ని నటిస్తూ జింకల నాయకుడైన దుప్పి ముందుకు వచ్చింది.?"మిత్రమా! నేను ముసలిదాన్ని అయ్యాను. గతంలో నేను మీకు చేసిన మోసానికి, ద్రోహానికి కొంతైనా ప్రాయశ్చిత్తం చేసుకోవాలని అనుకుంటున్నాను. ఇకపై మీ మందకు రాత్రిపూట నేను కాపలాగా ఉండి రక్షణ కల్పిస్తాను. నన్ను నమ్ము" అని ఎంతో ప్రాధేయపడింది. ?రక్షణ భారంతో అలసిపోయిన దుప్పి, ఆ తోడేలు ముసలితనాన్ని చూసి జాలిపడింది. అది వేటాడలేదు కాబట్టి తమకు ఎలాంటి ముప్పు ఉండదని అమాయకంగా నమ్మింది. మందలోని కొన్ని జింకలు తోడేలు మాటలను అనుమానించినా, తమ నాయకుడి నిర్ణయాన్ని కాదనలేక మౌనంగా ఒప్పుకున్నాయి. ఆ రాత్రికి జింకలన్నీ కొండ గుహలోకి చేరి విశ్రాంతి తీసుకోసాగాయి. తోడేలు గుహ ముందు నిలబడి కాపలా కాయడం మొదలుపెట్టింది.?నాయకుడి మాట జవదాటలేకపోయినా, మందలోని కొన్ని తెలివైన దుప్పులు జరగబోయే ప్రమాదాన్ని ముందే ఊహించాయి. శత్రువు స్వభావాన్ని నమ్మి అసలుకే మోసం తెచ్చుకోకూడదని భావించాయి. అందుకే అవి మందకు నలువైపులా చేరి, నిద్రపోతున్నట్టు నటిస్తూ చాలా అప్రమత్తంగా వేచి ఉన్నాయి. అర్ధరాత్రివేళ మందంతా గాఢ నిద్రలో ఉందనుకుని, తోడేలు తన అసలు రూపాన్ని బయటపెట్టింది. దానికి ఒక్కసారిగా ఆకలి పెరిగిపోయింది. నిద్రిస్తున్న ముసలి జింకలను, చిన్న పిల్లలను చూడగానే నోరూరింది. గుహలోకి నెమ్మదిగా అడుగులు వేస్తూ వచ్చి, ఒక చిన్న జింకపిల్లను నోట కరుచుకోబోయింది.అప్పుడే నిద్ర నటిస్తున్న తెలివైన దుప్పులు ఒక్కసారిగా గట్టిగా అరుస్తూ మందను హెచ్చరించాయి. ఆ అరుపులకు గుహలోని జింకలన్నీ క్షణాల మీద లేచి నిలబడ్డాయి. తోడేలు ఆ హఠాత్ పరిణామానికి బిత్తరపోయింది. అది తేరుకునేలోపే, బలమైన కొమ్ములున్న మగ జింకలు ఒకేసారి దానిపైకి దూకాయి. గుహ లోపలికివచ్చే దారి ఇరుకుగా ఉండటంతో తోడేలుకు తప్పించుకునే అవకాశం లేకపోయింది. యువ జింకలన్నీ ఏకమై తమ పదునైన కొమ్ములతో దాన్ని అన్నివైపుల నుంచి పొడవడం మొదలుపెట్టాయి.

ఆ ఉమ్మడి దాడికి తట్టుకోలేక, ఒళ్లంతా గాయాలతో ప్రాణభయంతో అరుస్తూ ఆ తోడేలు అడవిలోకి పరుగులు తీసింది. ఆ తర్వాత మళ్లీ ఎన్నడూ ఆ ప్రాంతం వైపు కన్నెత్తి చూడలేదు.?ముసలివాడైన జింకల నాయకుడు దుప్పి, శత్రువు మాయమాటలు నమ్మి తాను చేసిన పొరపాటును తెలుసుకుంది. వివేకంతో, ముందుచూపుతో ప్రమాదాన్ని ఊహించి, ఐకమత్యంతో ఆ వినాశనాన్ని తిప్పికొట్టిన తన మందలోని తెలివైన జింకలను ఎంతో గర్వంగా అభినందించింది.

# విజయ్ ప్రధాని...రాహుల్ శిబిరం అసహనం

విజయ్ ప్రధాని అన్న ప్రచారాన్ని టీవీకే నేతలు అతి ఉత్సాహంతో చేస్తున్నారు. పార్టీ నేతలు అయితే ఏమో అనుకోవచ్చు ఏకంగా మంత్రులు కూడా విజయ్ సార్ ప్రధాని అయ్యే అర్హతలు కలిగి ఉన్నారంటూ పొగుడుతున్నారు. దాంతో పాటు ఫ్లెక్సీలు కూడా కట్టి మరీ టీవీకే నేతలు చేస్తున్న హంగామా తమిళనాడు సరిహద్దులు దాటి ఢిల్లీ దాకా వ్యాపించింది. దాంతో కాంగ్రెస్ దీని మీద సీరియస్ గా ఉంటే రాహుల్ శిబిరం పూర్తి అసహనం వ్యక్తం చేస్తోంది అని అంటున్నారు. ఇంతకీ నాలుగు నెలల ముఖ్యమంత్రి అయిన టీవీకే అధినేత తమిళనాడు సీఎం విజయ్ అపుడే ప్రధాని అయిపోవడమేంటి అన్న చర్చ వస్తోంది. ఎందుకిలాంటి ప్రచారం వచ్చింది అంటే విజయ్ పేరుని కూడా పరిగణనలోకి తీసుకుంటూ ఇండియా టుడే -- సీఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ పేరుతో సర్వే చేశాయి. అందులో రాహుల్ గాంధీకి 27 శాతం ఓట్లు వస్తే విజయ్ కి తొమ్మిది శాతం ఓట్లు వచ్చాయి. అఫ్ కోర్స్ ప్రధాని మోడీ ఎవరికీ అందనంత ఎత్తులో 49 శాతంతో ముందు వరసలో ఉన్నారనుకోండి.

**టీవీకేలో ఉత్సాహం :**

టీవీకే ఒక రాజకీయ పార్టీ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేయడమే కాదు ఏకంగా ముఖ్యమంత్రి పీఠం పట్టేసింది. దక్షిణాదిన అతి పెద్ద స్టేట్ అయిన తమిళనాడుకు విజయ్ సీఎం అయిపోయారు. అంతే కాదు రెండు ప్రధాన పార్టీలు అయిన ద్రవిడ శిబిరాలను కకావికలం చేసి వారి రాజకీయాలు అయోమయంలో పడేశారు. ఇక విజయ్ సీఎం అయిన తరువాత తనదైన శైలిలో పనిచేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. విజయ్ సాధించిన ఈ అనూహ్యమైన సక్సెస్ అయితే జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున చర్చగా సాగుతూ వస్తోంది. ఆయనకు జెన్ జీ మద్దతు ఉందని కూడా విశ్లేషణలు ఉన్నాయి. ఇపుడు చూస్తే విద్యార్థి ఉద్యమాలతో జెన్ జీ చురుకుగా ఉంది. ఈ నేపథ్యంలో మూడ్ ఆఫ్ ది నేషన్ కింద ప్రధాని రేసులో ఉన్న వారి జాబితాలోకి విజయ్ పేరుని కూడా తీసుకుంటే ఆయనకు ఆశ్చర్యకరంగా తొమ్మిది శాతం మద్దతు లభించింది.

**టాప్ త్రీలో విజయ్ :**

అంతే కాదు టాప్ త్రీలో విజయ్ పేరు ఉండటంతో మోడీ వర్సెస్ రాహుల్ తో పాటు విజయ్ కూడా రేసులోకి దూసుకుని వచ్చారు అని అంటున్నారు. ఇండియా టుడే -- సీఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే ఫలితాల ప్రకారం చూస్తే ప్రధాని రేసులో తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ మూడో స్థానంలో నిలిచి




సంచలనం సృష్టించారు. ఆయనకు సర్వేలో 9.2 శాతం మద్దతు లభించింది. ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోదీ: 49 శాతం మద్దతుతో మొదటి స్థానంలో ఉంటే రాహుల్ గాంధీ 27 శాతం మద్దతుతో రెండో స్థానంలో నిలిచారు. దాంతో దేశంలో విపక్ష కూటమిని నడిపించే నేతగా ప్రతిపక్ష కూటమికి నాయకత్వం వహించడానికి అత్యంత అనుకూలమైన నాయకుడు ఎవరనే ప్రశ్నకు కూడా జవాబుగా విజయ్ ఆశ్చర్యకరమైన ఫలితాలను సాధించారు అంటున్నారు. ఇక ఈ రేసులో వెనుకబడిన జాతీయ నాయకులుగా మమతా బెనర్జీ 2 శాతం అఖిలేష్ యాదవ్ 1.7 శాతం, అరవింద్ కేజ్రీవాల్ 1.2 శాతం సాధించారు. ఇండియా టుడే సీఓటర్ సర్వే ఫలితాలు వెల్లడి కావడంతో జయ్ క్రేజ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ముఖ్యంగా యువ ఓటర్లలో విస్తరిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**రాహుల్ తోనే సాధ్యం :**

అయితే ఈ సర్వే ఫలితాలు టీవీకేలో కొత్త ఉత్సాహం నింపాయి, కాబోయే ప్రధాని అంటూ టీవీకే మంత్రులు కూడా అంటున్న నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ విజయ్ అధికారంలోకి రావడానికి కీలకంగా వ్యవహరించిన కాంగ్రెస్ అయితే తీవ్ర స్థాయిలో స్పందిస్తోంది. ఇది మంచి విధానం కాదని తమిళ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. మోడీని ఢీ కొట్టే సత్తా రాహుల్ గాంధీకి మాత్రమే ఉందని అంటున్నారు. ఇక కాంగ్రెస్ సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్ లాంటి వారు అయితే మంత్రులు కూడా అభిమానులుగా మారిపోతే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు అని అంటున్నారు. మొత్తానికి విజయ్ కి జాతీయ స్థాయిలో మద్దతు దక్కడం కాదు కానీ తమిళనాడు ప్రభుత్వంలో చిచ్చు రాజేసేలా టీవీకే నేతల అతి ఉత్సాహం ఉందని అంటున్నారు.

# 90లలో వంద రూపాయలు...ఇపుడు విలువ ఎంతో తెలుసా ?




ఇప్పటికి మూడున్నర దశాబ్దాల క్రితం అంటే 1990 నాటికి వెళ్తే వంద రూపాయలు ఉంటే చాలు ఒక కుటుంబం ఎంత హాయిగా బతికేదో అంటూ పాత రోజులను గుర్తుకు తెస్తూ సోషల్ మీడియాలో కొందరు పోస్టులు పెడుతున్నారు. అప్పుడున్న ధరలను ఇప్పటి ధరలతో పోల్చుకుంటే ఎంత బాగుందో కదా అనిపిస్తోంది. ఒక్కసారి 1990లో ధరల జాబితా చూస్తే ఎవరికైనా ఆనాటి జీవితం భూతల స్వర్గం అనే మాట తప్పకుండా వస్తుంది. 1990లో కిలో బియ్యం 3.20 గా ఉంది. కాలం వేగంగా మారిపోతోంది. అభివృద్ధి మాటున ఏమి సాధించామన్నది పక్కన పెడితే గత కాలం మేలు వచ్చు కాలం కంటే అన్నది నిజం అని ఈ రోజుకీ అధిక శాతం నమ్ముతారు. ఎంత డబ్బు ఇపుడు సంపాదించినా సుఖాలు అయితే లేవు, అలాగే అప్పట్లో ఉన్న పరిస్థితులు ఇపుడు అసలు కనిపించవని వేడి నిట్టూర్పులు విడుస్తూంటారు. అందుకే పాత రోజులనే ఎక్కువ మంది గుర్తు చేసుకుంటూంటారు. ఇక ఈ రోజున చూస్తే ధరలు నింగిని అంటాయి. లక్షల రూపాయలు నెలకు జీతంగా వస్తున్నా హాయిగా బతికేందుకు ఇబ్బంది అవుతోంది అంటే దానికి కారణం నానాటికీ పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం అని చెబుతారు. ఆహార ద్రవ్యోల్బణం చూస్తే వేరే లెక్కగా ఉంది. దాంతో ఏమి కొనేందుకు లేదు తినేందుకు లేదు అన్న మాట ఎవర్ గ్రీన్ అవుతోంది.

**సరిగ్గా మూడున్నర దశాబ్దాలు :**

కిలో గోధుమపిండి 2.40, ఒక లీటర్ పాలు 6 రూపాయలు, ఒక డజన్ గుడ్లు 4 రూపాయలు. బస్సు టికెట్ 1.50, గ్యాస్ సిలిండర్ 35 రూపాయలు, పెట్రోల్ లీటర్ 7.50 రూపాయలు, స్కూల్ ఫీజు నెలకు 25 నుంచి 40 రూపాయలు మాత్రమే.

**ఇవి కూడా కారు చౌకగానే :**

అంతే కాదు కిలో చక్కెర 4.80 రూపాయలు, కిలో పప్పు 10 రూపాయలు, బ్రెడ్ ఒక ప్యాకెట్ 3.50 రూపాయలు. సిగరెట్ ఒక ప్యాకెట్ 6 రూపాయలు, వంట నూనె నెలకు సరిపడా 75 రూపాయల నుంచి 100 రూపాయలు. కాలేజీ ఫీజు 60 నుండి 150 మధ్యలోనే ఉన్నాయి. ఇక రైలులో ప్రయాణించాలంటే సామాన్యుల టికెట్ 5 నుంచి 12 రూపాయల మధ్య ఉండేది. బజాజ్ చేతక్ బండి ఆ రోజులల్లో 16 వేల రూపాయలు ఉంటే సినిమా టికెట్ ధర 8 నుంచి 12 రూపాయలుగా ఉంది. ఒక లక్ష రూపాయలు చేతిలో ఉంటే చాలు అందమైన సొంత ఇల్లు అన్ని రకాలైన వసతులతో నిర్మించుకునేవారు. ఇక బ్లాక్ అండ్ వైట్ టీవీ 850 నుంచి 1200 రూపాయలుగా ధర ఉంది.

**ఇప్పటి రేట్లతో పోలిస్తే :**

నిజానికి కాలం అనే ప్రవాహంలో మూడున్నర దశాబ్దాలు అంటే చాలా చిన్నదే. అయితే మానవ జీవితంలో ఎక్కువగానే చూడాలి. ఇవన్నీ పక్కన పెడితే ఆనాటి ధరలను చూసిన వారు ఈ నాటికీ ఆ ముచ్చట్లు చెప్పుకుంటూ ఉంటారు. అనూహ్యంగా ధరలు పెరిగిపోవడం ఆ రోజులలో లేదని కూడా అంటారు. ఆనాడు వంద రూపాయల విలువ ఈనాటి రేట్లతో పోలిస్తే అక్షరాలా మూడు వేల రూపాయల నుంచి మూడు వేల అయిదు వందల రూపాయలుగా చేస్తుందని అంటున్నారు. దీనిని బట్టి ఎన్ని రెట్లుగా ధరలు పెరిగాయి, ఆర్థిక ఆహార ద్రవ్యోల్బణం సామాన్యుడు మధ్య తరగతి జీవితాలను ఎంతగా చిదిమివేసింది అన్నది కూడా అర్థం అవుతుంది. అందుకే అప్పటి జీవితం సరళంగా సులువుగా సాగిపోయింది అని చెబుతారు.

**చీమ కుట్టినట్లుగా కూడా లేదని :**

ధరలను నియంత్రించలేని వ్యవస్థలో ఈ రోజు అంతా ఉన్నారు. ధరలు పెరగడం అన్నది పాలకులకు చీమ కుట్టినట్లుగా కూడా లేదని విమర్శలు ఉన్నాయి. పైగా ఒకపుడు అది అతి పెద్ద సమస్య. ఎంతలా అంటే ప్రభుత్వాలనే కూల్చేసేవిగా ఉండేది. ఒక్క ఉల్లిపాయ ఘాటు 90 దశకం చివర్లో ఏకంగా ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించింది. ఇపుడు మాత్రం అది రాజకీయ అజెండాలో లేకుండా పార్టీలు జాగ్రత్త పడ్డారా లేక సగటు జనాలలో పోరాడే శక్తి నశించిందా అన్నది పెద్ద ప్రశ్న. ఏదైనా ఎక్కువ కాలం కాదు కానీ 90 దశకం రోజులు కూడా గోల్డెన్ డేస్ అనుకుంటున్నారు అంటే ఇదేనా అభివృద్ధి అని అంతా ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది.

## 'సాయంత్రం 5కే లాగ్ఆఫ్?'.. అమెరికా వర్క్ కల్చర్‌పై భారతీయ మహిళ సంచలన వ్యాఖ్యలు



'సాయంత్రం 5 గంటలకే లాగ్ఆఫ్' అనేది ఒక అందమైన భ్రమ మాత్రమేనా? విదేశాల్లో ఉద్యోగం, డాలర్ల ఆదాయం, సాయంత్రం కాగానే సొంత సమయం.. విదేశాలకు వెళ్లే ప్రతి ఒక్కరూ కనే కల ఇది. కానీ సరిహద్దులు దాటినా సముద్రాలు దాటినా కొన్ని రూల్స్ మారవు. ముఖ్యంగా కార్పొరేట్ ఒత్తిడికి ఎలాంటి పాస్‌పోర్ట్ ఉండదు. ఈ చేదు నిజాన్ని ప్రపంచం ముందుకు తెచ్చారు అమెరికాలో తొమ్మిదేళ్ల పాటు కన్సల్టెంట్‌గా పనిచేసి ఇటీవల ముంబైకి తిరిగి వచ్చిన పరిణయ. అమెరికాలోనూ ఓవర్‌వర్క్, ఆఫీస్ ఒత్తిడి, బర్నౌట్ సాధారణమేనని ఆమె వెల్లడించారు.పరిణయ అమెరికాలో దాదాపు తొమ్మిదేళ్ల పాటు కన్సల్టెంట్‌గా పనిచేశారు. తన అనుభవాలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. "అమెరికాలో సాయంత్రం 5 గంటలకు లాగ్ఆఫ్ అవుతారనే మిథ్ ఇక చనిపోవాలి" అంటూ వ్యాఖ్యానించారు. అమెరికన్ ఉద్యోగులు సాధారణంగా 5 గంటలకు పని ముగించుకుని వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయిస్తారనే భావన వాస్తవానికి చాలా దూరంగా ఉందని ఆమె అన్నారు.

**7 గంటలకు మేనేజర్ మెసేజ్..**

తన ఉద్యోగ జీవితంలో పని గంటలు ముగిసిన తర్వాత కూడా ఆఫీస్ మెసేజ్‌లు రావడం సాధారణమని పరిణయ చెప్పారు. ఒక సందర్భంలో సాయంత్రం 7 గంటల సమయంలో తన మేనేజర్ నుంచి మెసేజ్ వచ్చిందని ఆమె గుర్తుచేసుకున్నారు. తాను పంపిన ఈమెయిల్‌కు ఎందుకు స్పందించలేదని మేనేజర్ ప్రశ్నించారని తెలిపారు. దీంతో అధికారిక పని సమయం ముగిసిన తర్వాత కూడా ఉద్యోగి అందుబాటులో ఉండాలనే అంచనాలు ఉంటాయని ఆమె వివరించారు. అయితే అమెరికా పని సంస్కృతిని పూర్తిగా తప్పుబట్టడం తన ఉద్దేశం కాదని పరిణయ స్పష్టం చేశారు. ఏ దేశంలోనైనా ఉద్యోగం, కంపెనీ, పరిశ్రమ, బాధ్యతలను బట్టి పని గంటలు మారుతాయని చెప్పారు. కానీ 'హసిల్ కల్చర్' లేదా ఎప్పుడూ పనికి అందుబాటులో ఉండాలనే ఒత్తిడి ఒక్క దేశానికే పరిమితం కాదని ఆమె పేర్కొన్నారు.

**అమెరికాలోనూ ఎక్కువ గంటల పని**

తన వాదనకు మద్దతుగా పరిణయ ప్రస్తావించిన గణాంకాల ప్రకారం, అమెరికాలో సుమారు 32 శాతం మంది ఉద్యోగులు వారానికి 45 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సమయం పనిచేస్తున్నారు. జర్మనీలో ఈ సంఖ్య 18 శాతంగా.. ఫ్రాన్స్‌లో కేవలం 4 శాతంగా ఉందని ఆమె పేర్కొన్నారు. అలాగే దాదాపు 29 శాతం మంది అమెరికన్లు వారాంతాల్లో కూడా పని చేస్తున్నారని తెలిపారు. ఈ గణాంకాలు చూస్తే 40 గంటల పని వారమే ప్రామాణికంగా ఉన్నప్పటికీ.. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు దాని కంటే ఎక్కువ సమయం పనిచేస్తున్న విషయం స్పష్టమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

**'ఓవర్‌వర్క్ ఏ ఒక్క దేశానిదీ కాదు'**

"ఓవర్‌వర్క్ అనేది ఒక దేశానికి సంబంధించిన విషయం కాదు. అది ప్రతిచోటా ఉంది. ఉద్యోగాలు వేరు.. కంపెనీలు వేరు.. కానీ ఎప్పుడూ అందుబాటులో ఉండాలనే ఒత్తిడి మాత్రం ఒకటే" అని పరిణయ అన్నారు. తన అనుభవంలో మరో అంశం కూడా తనను ఆలోచింపజేసిందని ఆమె చెప్పారు. చాలా కాల్స్‌లో తానే ఏకైక 'బ్రౌన్ పర్సన్'గా ఉండేదానినని.. కొన్ని సందర్భాల్లో ఇతర సహోద్యోగులతో పోలిస్తే తనను మరింత కఠినంగా ప్రశ్నిస్తున్నారా అనే అనుమానం కలిగేదని తెలిపారు. అయితే దీనిని నిరూపించడానికి తన వద్ద ఆధారాలు లేవని.. అది కేవలం తనకు కలిగిన భావన మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు.

**ముంబైకి ఎందుకు తిరిగొచ్చారు?**

అమెరికాలో దాదాపు తొమ్మిదేళ్లు కెరీర్ నిర్మించుకున్న తర్వాత పరిణయ తిరిగి ముంబైకి వచ్చారు. కెరీర్‌లో ముందుకు వెళ్లాలనే ప్రయత్నంలో పెరుగుతూ వచ్చిన పని ఒత్తిడి, వ్యక్తిగత జీవితంపై ప్రభావం తన నిర్ణయాన్ని ప్రభావితం చేశాయని ఆమె తెలిపారు. చివరకు కెరీర్ కంటే మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అమెరికాలో ఉద్యోగం చేస్తే తప్పనిసరిగా మెరుగైన వర్క్-లైఫ్ బ్యాలెన్స్ లభిస్తుందనే అపోహను తన అనుభవం తొలగించిందని ఆమె అభిప్రాయపడ్డారు. విదేశాల్లో ఉద్యోగం అంటే అవకాశాలు, మంచి ఆదాయం, కెరీర్ గ్రోత్ మాత్రమే కాకుండా.. అక్కడి పని సంస్కృతి, ఉద్యోగ ఒత్తిళ్లను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె కథనం చెబుతోంది. చివరగా పరిణయ చెప్పిన మాట ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది.. "మానసిక ప్రశాంతత అన్నింటికంటే ముఖ్యం." ఆమె అనుభవం ఒక విషయం మాత్రం స్పష్టం చేస్తోంది. ఓవర్‌వర్క్‌కు పాస్‌పోర్ట్ ఉండదు. దేశం మారినా, కంపెనీ మారినా.. ఉద్యోగిపై 'ఎప్పుడూ అందుబాటులో ఉండాలి' అనే ఒత్తిడి ఉంటే బర్నౌట్ తప్పకపోవచ్చు.

డాలర్ల కలల కంటే, కెరీర్ మైలురాళ్ల కంటే చివరికి మనిషికి మిగిలేది, కావాల్సింది మానసిక ప్రశాంతత మాత్రమే. అందుకే పరిణయ తన తొమ్మిదేళ్ల అమెరికా కెరీర్‌ను పక్కన పెట్టి, మానసిక ఆరోగ్యం కోసం తిరిగి ముంబై చేరుకోవాలని నిర్ణయించుకున్నారు. దేశం మారితే జీవితం మారిపోతుందని నమ్మే ప్రతి ఒక్కరికీ ఈ కథనం ఒక మేల్కొలుపు. పని ఎక్కడైనా పని చేయాల్సిందే.. కానీ ఆ పని మన ప్రశాంతతను, ఆరోగ్యాన్ని మింగేసే స్థాయికి వెళ్లకూడదనే సత్యాన్ని ఇది మరోసారి గుర్తుచేస్తోంది.

## కియా 'సొరెంటో' వచ్చేస్తోంది.. ఫార్చ్యూనర్ కు సరైన పోటీ?

భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కియా ఇండియా, ఇప్పుడు ప్రీమియం సెగ్మెంట్‌పై దృష్టి సారించింది. తన ఫ్లాగ్‌షిప్ ఇంటర్నల్ కంబస్టన్ ఇంజిన్ ఎస్‌యూవీ అయిన 'కియా సొరెంటో'ను సెప్టెంబర్ 4న దేశీయ మార్కెట్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. కేవలం అమ్మకాల కోసమే కాకుండా, బ్రాండ్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లే వ్యూహంలో భాగంగా ఈ కొత్త వాహనాన్ని కియా తీసుకువస్తోంది.ప్రస్తుతం భారత మార్కెట్‌లో సెల్టోస్, సోనెట్, కారెన్స్, కార్నివాల్ మోడళ్లతో కియా మంచి విజయాన్ని అందుకుంది. సెల్టోస్ మెయిన్‌స్ట్రీమ్ ఫ్లాగ్‌షిప్‌గా ఉండగా, ఈవీ6 ఎలక్ట్రిక్ విభాగంలో ప్రీమియం ఆఫర్‌గా ఉంది. ఈ రెండింటి మధ్య ఉన్న ఖాళీని భర్తీ చేస్తూ, మూడు వరుసల సీటింగ్‌తో వచ్చే సంప్రదాయ ప్రీమియం ఎస్‌యూవీగా సొరెంటో నిలవనుంది. సుమారు రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల ధరల శ్రేణిలో విడుదలయ్యే అవకాశం ఉన్న ఈ కారు... టయోటా ఫార్చ్యూనర్, స్కోడా కొడియాక్, టయోటా ఇన్నోవా హైక్రాస్, జీప్ మెరిడియన్ వంటి బలమైన పోటీదారులను ఢీకొట్టనుంది.ఈ కారులో అత్యంత కీలకమైన అంశం దాని హైబ్రిడ్ ఇంజిన్. 1.6-లీటర్ టర్బో-పెట్రోల్ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్‌తో ఇది రానుంది. ఇది సుమారు 235 ఎస్ట్రజూ శక్తిని, 380 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుందని అంచనా. డీజిల్ వాహనాలకు ప్రత్యామ్నాయం చూస్తూ, పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ వాహనాలపై ఇంకా సంశయిస్తున్న కొనుగోలుదారులకు ఇది చక్కటి ఆప్షన్‌గా నిలుస్తుంది. రిఫైన్‌మెంట్, అధిక మైలేజీ, అద్భుతమైన పనితీరును ఒకే ప్యాకేజీలో అందించడం దీని ప్రత్యేకత. ఇప్పటికే టయోటా హైబ్రిడ్ కార్లతో విజయవంతమైన నేపథ్యంలో, కియా కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తోంది.సొరెంటో క్యాబిన్ కూడా అత్యంత ప్రీమియంగా, ఆధునికంగా ఉండనుంది. డ్యూయల్ 12.3-అంగుళాల డిస్‌ప్లేలు, పనోరమిక్ లేఅవుట్, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ూణూూూ), 360-డిగ్రీ కెమెరా వంటి ఫీచర్లు ఇందులో ఉంటాయి. కుటుంబంతో కలిసి సుదూర ప్రయాణాలకు అనువుగా, సౌకర్యవంతమైన మూడు వరుసల సీటింగ్ దీని సొంతం.కియా ఈ కారును భారీ అమ్మకాల కోసం కాకుండా, తమ బ్రాండ్ విలువను పెంచే 'బ్రాండ్-బిల్డర్'గా చూస్తోంది. అయితే, ఫార్చ్యూనర్ వంటి బలమైన పోటీదారు ఉన్న మార్కెట్‌లో నిలదొక్కుకోవడం అంత సులభం కాదు. సరైన ధర, స్థానికీకరణ వంటి అంశాలు సొరెంటో విజయంలో కీలక పాత్ర పోషిస్తాయి. అన్నీ అనుకూలిస్తే, భారత మార్కెట్‌లో కియాకు ఇది ఒక కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసే అవకాశం ఉంది.



# మెదడు భళా

మెదడు ఆరోగ్యం కేవలం వైద్యపరమైన అంశం కాదు.. సామాజిక, ఆర్థిక అవసరం కూడా. స్పష్టంగా, చురుకుగా ఆలోచించటం, సమర్థంగా నేర్చుకోవటం, ముఖ్యమైన సమాచారాన్ని గుర్తుంచుకోవటం, జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించటం.. అన్నీ దీంతో ముడిపడినవే. చదువుకోవటం, పనులు, ఉద్యోగాలు చేయటం, కుటుంబ సంరక్షణ, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనటం, భావోద్వేగ నియంత్రణ, మానసిక దృఢత్వం వంటివన్నీ దీని చలవే. అందుకే మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవటం అత్యవసరం. ఇది ఏదో ఒక రోజులో దక్కేది కాదు. ఏదో ఒక వయసుకో పరిమితం కాదు. నిరంతరం ప్రయత్నించాల్సిందే. జీవితాంతమూ కాపాడుకోవాల్సిందే.

**చెమటోడ్చాలి**

శరీరమే కాదు, మెదడు ఆరోగ్యంగా ఉండటానికీ వ్యాయామం అవసరం. దీంతో మెదడుకు రక్త సరఫరా పెరిగి బుద్ధి కుశలత, మానసిక సామర్థ్యం ఇనుమడిస్తాయి. వారానికి కనీసం 150 నిమిషాల సేపు వ్యాయామం చేయాలి. అంత సమయం దొరకటం లేదంటే 10 నిమిషాల చొప్పున విభజించుకొని రోజంతా అప్పుడప్పుడు చేయొచ్చు. గుండె, శ్వాస వేగం పెంచే ఏరోబిక్ వ్యాయామాలు (వేగంగా నడవటం వంటివి) మేలు. వీలైతే తీవ్ర వ్యాయామాలూ చేయొచ్చు. ఇవైతే వారానికి కనీసం 75 నిమిషాలు చేసినా చాలు. వ్యాయామంతో అల్జీమర్స్ జబ్బు ముప్పు సైతం తగ్గుతుంది.

**తలను కాపాడుకోవాలి**

మెదడుకు పుర్రె రక్షణ కవచం. దీన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. మెదడుకు గాయమైతే ఆలోచన, జ్ఞాపకశక్తి, సమన్వయం, మాట, భావోద్వేగాలు గణనీయంగా మారిపోతాయి. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలి. తలకు గాయాలయ్యే అవకాశం గల క్రికెట్ వంటి ఆటలు ఆడేటప్పుడూ విధిగా హెల్మెట్ పెట్టుకోవాలి. మెట్లు, నిచ్చెన ఎక్కేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇంట్లో వస్తువులు నేల మీద చిందరవందరగా పడేయకుండా చూసుకోవాలి.

**ఆరోగ్యం మీద కన్ను**

మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బుల వంటివి ఆలోచన, జ్ఞాపకశక్తి తగ్గటానికీ దారితీస్తుంటాయి. పక్షవాతం ముప్పు పెరిగేలా చేస్తుంటాయి కూడా. కాబట్టి ఇలాంటి సమస్యల విషయంలో నిర్లక్ష్యం తగదు. క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదిస్తూ, అవసరమైన మందులు విధిగా వేసుకోవాలి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. విషయగ్రహణ సామర్థ్యాన్ని దెబ్బతీసే జబ్బులను ముందుగానే పట్టుకోవటానికివి తోడ్పడతాయి.

మానసిక ఒత్తిడి మెదడుకు చిత్తు చేస్తుంది. కాబట్టి యోగా, ధ్యానం, ప్రాణాయామం, ప్రకృతితో గడపడటం వంటి వాటితో ప్రశాంతతను అలవరచుకోవాలి.

**సన్నిహిత సంబంధాలు**

కుటుంబ సభ్యులతో అన్యోన్యంగా ఉండాలి. వీలైనప్పుడల్లా స్నేహితులు, బంధువులతో కలవాలి. వారినైనా ఇంటికి ఆహ్వానించాలి. దీంతో సామాజిక సంబంధాలు బలపడతాయి. కుంగుబాటు, ఒత్తిడి సమస్యలు తగ్గుతాయి. ఇవి రెండూ మతిమరుపును తీవ్రం చేసేవే కావటం గమనార్హం. ఇతరులతో కలవకుండా, ఒంటరిగా ఉంటే ఆలోచనా నైపుణ్యాలు తగ్గటంతో పాటు అల్జీమర్స్ జబ్బు ముప్పూ పెరుగుతుంది. కాబట్టి సామాజిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనటం మంచిది.

**కంటి నిండా నిద్ర**

రాత్రిపూట సామాజిక మాధ్యమాలు, ఓటీటీల పేరుతో నిద్రను బలి పెట్టొద్దు. కంటి నిండా నిద్రపోతేనే మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి, అప్రమత్తత పుంజుకుంటాయి. ఇవి రోజువారీ పనులు హాయిగా చేసుకోవటానికి తోడ్పడతాయి. తగినంత విశ్రాంతి తీసుకోవటం వల్ల మానసిక ఒత్తిడి, కుంగుబాటూ తగ్గుతాయి. కాబట్టి రాత్రిపూట 7-9 గంటల సేపు నిద్రించేలా చూసుకోవాలి. గురక వంటి నిద్ర సమస్యలుంటే చికిత్స తీసుకోవాలి.

**ఆహారం సమతులంగా**

తినే ఆహారం మెదడుకూ శక్తినిస్తుంది. డిమెన్షియా లక్షణాల నివారణకు లేదా ఆలస్యం కావటానికి ఆరోగ్యకరమైన ఆహారం తోడ్పడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గింజపప్పులు, నిండు గింజ ధాన్యాలు, చేపలు, చికెన్‌తో కూడిన ఆహార పద్ధతి ఎంతగానో మేలు చేస్తుంది. అయితే మాంసం, మిఠాయిలు, తీపి పానీయాలు, వెన్న, ఛీజ్ వంటి వాటి విషయంలో మితం పాటించాలని మరవరాదు.

**మద్యం విషయంలో జాగ్రత్త**

నాడీకణాలు ఒకదాంతో మరోటి సమాచారం ఇచ్చిపుచ్చుకునే తీరును మద్యం, మాదక ద్రవ్యాలు దెబ్బతీస్తాయి. ఇవి ప్రతిస్పందించే వేగం, ప్రణాళిక వేసుకోవటం, సమస్యల పరిష్కారం, భావోద్వేగ నియంత్రణ సామర్థ్యాలనూ తగ్గిస్తాయి. కాబట్టి మద్యం, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు. మద్యం అలవాటుంటే పరిమితం చేసుకోవాలి. మద్యం మితిమీరితే కింద పడి మెదడుకు దెబ్బలు తగిలే ప్రమాదమూ ఉంది. మెదడును దెబ్బతీసే అధిక రక్తపోటు, మధుమేహం వంటి జబ్బుల ముప్పూ పెరుగుతుంది.

డాక్టర్ల సలహా లేకుండా ఎలాంటి మందులను వేసుకోకూడదనీ గుర్తుంచుకోవాలి.

**సవాలే సవాల్**

వ్యాయామం శరీర సౌష్టవానికి తోడ్పడినట్టే మేధకు మేత పెట్టే పనులు మెదడును సజావుగా ఉంచుతాయి. పుస్తకాలు చదవటం, పజిల్స్ పూరించటం, కొత్త భాషలు నేర్చుకోవటం, సంగీత పరికరాలు వాయించటం వంటివి విషయగ్రహణ సామర్థ్యాలు పెరగటానికి, వాటిని కాపాడుకోవటానికి తోడ్పడతాయి. కాబట్టి కొత్త హాబీని అలవరచుకోవటం మంచిది.

**బాల్యం నుంచే..**

చాలామంది పెద్దగా పట్టించుకోరు గానీ బిడ్డ తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే మెదడు ఎదుగుదల మొదలవుతుంది. ఇది బాల్యమంతా కొనసాగుతూ వస్తుంటుంది. కాబట్టి గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలి. పుట్టిన తర్వాత శిశువులకు ఆటబొమ్మల వంటి వాటితో మెదడుకు ప్రేరణ కల్పించాలి. పెద్దగా అవుతున్నకొద్దీ ఆయా విషయాలను తెలుసుకునేలా అవకాశాలు కల్పించాలి. కథలు వినిపించటం, పుస్తకాలను పరిచయం చేయటం వంటివి మేలు చేస్తాయి. తోటి పిల్లలతో గడపటాన్ని ప్రోత్సహించాలి. కుటుంబ సభ్యులు, పెద్దవారితో గడపటం వల్ల సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ నియంత్రణ పట్టుబడతాయి. అలాగే రోజులో ఎక్కువసేపు ఆడుకునేలా చూడాలి. చిన్నప్పటి నుంచే వ్యాయామం చేయటం అలవాటు చేయాలి. దీంతో మెదడుకు రక్తసరఫరా పెరిగి, విషయగ్రహణ సామర్థ్యం ఇనుమడిస్తుంది. కంటి నిండా నిద్రపోయేలా చూసుకోవటమూ ముఖ్యమే. మెదడు ఎదుగుదల, జ్ఞాపకాలు కుదురుకోవటంలో ఇది చాలా కీలకం,


# కిడ్నీల ఆరోగ్యానికి మంచి నీళ్ల సాయం... అంతా ఇంతా కాదు!

**జీవరాశి మనుగడకు కీలకంగా ఉన్న మంచినీరు**

**శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలంటున్న నిపుణులు**

**తగినంత నీరు తాగకపోతే యూరిక్ యాసిడ్ పేరుకుపోయే ప్రమాదం**

**కిడ్నీల్లో రాళ్లు, గౌట్ వంటి సమస్యలకు ప్రధాన కారణం యూరిక్ యాసిడ్**



భూమిపై జీవానికి ప్రాణాధారం నీరు. మనిషి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర నీటిదే. ముఖ్యంగా కిడ్నీల పనితీరుకు తోడ్పాటు అందిస్తూ మంచి నీరు అత్యంత ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అయితే, నీళ్లు కిడ్నీల ఆరోగ్యాన్ని ఎలా కాపాడతాయో చూద్దాం!

మానవ దేహంలోని వ్యర్థాలు మలమూత్రాల రూపంలో విసర్జితమవుతాయని తెలిసిందే. మూత్రం ద్వారా యూరిక్ యాసిడ్ వంటి ఘాటైన పదార్థాలు బయటికి పోతాయి. కొన్నిరకాల పదార్థాలు తిన్నప్పుడు, కూల్ డ్రింక్స్, మద్యం సేవించినప్పుడు శరీరంలో యూరిక్ యాసిడ్ అధిక మొత్తంలో పేరుకుపోతుంది. దీన్ని బయటికి పంపించే పని కిడ్నీలదే.

అయితే నీరు తక్కువగా తాగడం వల్ల శరీరంలో పెరిగిపోయిన యూరిక్ యాసిడ్ నిల్వలను కిడ్నీలు పూర్తిగా విసర్జించలేవు. దాంతో కిడ్నీల్లో రాళ్లు, గౌట్ వంటి కీళ్ల సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇలాంటి సమస్యలతో వైద్యుల వద్దకు వెళితే, వారు వీలైనంత అధికంగా మంచినీళ్లు తాగమనే చెబుతారు. మంచినీళ్లు తాగడం వల్ల రక్తంలోని యూరిక్ యాసిడ్ పల్చబడుతుంది. అప్పుడది కిడ్నీల ద్వారా వడపోతలకు గురై వ్యర్థాలు మూత్రం ద్వారా వెలుపలికి వచ్చేస్తాయి. నీళ్లు సరిగా తాగకపోతే, మూత్రం మరింత గాఢతను సంతరించుకుంటుంది . కిడ్నీలు యూరిక్ యాసిడ్ ను వడపోయడంలో సమర్థవంతంగా పనిచేయలేవు. అలాంటప్పుడు యూరిక్ యాసిడ్ శరీరంలో అధిక మొత్తంలో పోగుపడుతుంది. అది ఘనీభవించి రాళ్లుగా మారుతుంది. ఇతర అనారోగ్య సమస్యలు కూడా మొదలవుతాయి.

శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా ఉత్పత్తికావడానికి పలు కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒబేసిటీతో బాధపడుతున్న వారిలో యూరిక్ యాసిడ్ స్థాయిలు అధికంగా ఉంటాయని తెలిపారు. మంచినీళు ఎక్కువగా తాగకపోవడం వల్ల ఆరోగ్యకరమైన శరీర బరువును కొనసాగించలేరని, ఇలాంటివాళ్లు బరువు పెరగడమో, ఊబకాయులుగా మారడమో జరుగుతుందని,

దాంతో యూరిక్ యాసిడ్ తో కలిగే సమస్యల బారినపడుతుంటారని నిపుణులు వివరించారు. లేకపోతే కిడ్నీలపై విపరీతమైన భారం పడుతుందని, క్రమంగా ఇది కిడ్నీల వైఫల్యానికి దారితీస్తుందని వివరించారు. ఇలాంటి సమస్యల బారినపడకూడదనుకుంటే అందుకు నీళ్లే ఔషధం అని స్పష్టం చేశారు. నీళ్లు కిడ్నీల పనితీరునే కాకుండా, విషపదార్థాల ఏరివేతలో సహాయపడే కాలేయానికి తోడ్పాటునందిస్తాయని తెలిపారు. శరీరంలో హానికర పదార్థాల వడపోతకు సహకరించే ఏ అవయవానికైనా మంచి నీళ్లే మంచి మిత్రుడు అనొచ్చని పేర్కొన్నారు.

# ఈ ఐదు హ్యాబిట్స్ మీకు ఉంటే.. మంచి ఆరోగ్యం సొంతం

**నిత్యం వ్యాయామాలు చేయాల్సిందే**

**పోషకాహారం తీసుకోవాలి**

**ప్రతి రోజూ 7-9 గంటల పాటు నాణ్యమైన నిద్ర**

**ఒత్తిడి ఎక్కువ కాకుండా చర్యలు తీసుకోవాలి**

ఆరోగ్యంగా ఉండాలని కోరుకోని వారు ఉండరు. కానీ, మిగతా విషయాల పట్ల ఉన్న శ్రద్ధ ఆరోగ్యం విషయంలో చూపించరు. దీంతో క్రమంగా ఆరోగ్యానికి నష్టం జరుగుతుంటుంది. నడి వయసుకే ఎన్నో ఆరోగ్య సమస్యలు మొదలవుతుంటాయి. సాధారణంగా 60 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు రావడం సహజం. కానీ 30-40 ఏళ్లకే ఆరోగ్యం విషయంలో సమస్యలు రావడం అంటే కచ్చితంగా శ్రద్ధ తీసుకోవాల్సిందే. 30-40 ఏళ్లకే వృద్ధాప్యపు ఛాయలు రాకూడదని కోరుకుంటే, 50 ఏళ్లు దాటినా నడి వయసు వారి మాదిరే యవ్వనంగా కనిపించాలంటే అదేమీ పెద్ద కష్టమైన విషయం కాదు. కాకపోతే కొన్ని చర్యలను పాటించాల్సి ఉంటుంది. వృద్ధాప్యంలో కణాలు దెబ్బతినడం, క్షీణించడం మొదలవుతుంది. కణాల మధ్య మెరుగైన కమ్యూనికేషన్ ప్రక్రియ బలహీనపడుతుంది. కొన్ని చర్యల ద్వారా ఈ ప్రక్రియలను నిలువరించామంటే యవ్వనంగా ఉండొచ్చు.

రోజువారీ వ్యాయామాలు జీవన విధానంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం ఐదు రోజుల పాటు, రోజుకు 30-45 నిమిషాల పాటు చేయాల్సి ఉంటుంది. వాకింగ్, జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, ఏరోబిక్ వ్యాయామాలు, జిమ్ లో కసరత్తులు ఏవైనా కావచ్చు. ముఖ్యంగా గుండె బలపడడానికి వ్యాయామాలు ఉంటాయి. వాటిని కూడా చేయాలి.



ఆహారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఏదో ఒకటి లేదంటే రుచికరమైనది తినేశామంటే కుదరదు. తీసుకునే ఆహారం ఏదైనా కానీ, అందులో పోషకాలు ఉండాలి. ముడి ధాన్యాలు, తృణ ధాన్యాలు, కూరగాయలు, ఆకుపచ్చని కూరగాయలు తీసుకోవాలి. అదే సమయంలో చక్కెరలు, ప్రాసెస్డ్ ఫుడ్స్, స్నాక్స్ తీసుకోకూడదు.

ఇక నాణ్యమైన నిద్ర చాలా అవసరం. రోజులో 7 నుంచి 9 గంటల వరకు నిద్ర పోవచ్చు. కాకపోతే ఈ నిద్ర కూడా కలత నిద్ర అవ్వకూడదు. అవాంతరాల్లేని నాణ్యమైన, గాఢనిద్ర అవ్వాలి. ఇందు కోసం నిద్రకు గంట ముందు నుంచి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను వినియోగించకూడదు. పడకగదిలో వెలుతురు లేకుండా చూసుకోవాలి. నిద్రకు, రాత్రి భోజనానికి మధ్య 2 గంటల విరామం ఉండాలి.

ఒత్తిడి లేకుండా చూసుకోవడం కూడా ఆరోగ్యం పరంగా అత్యంత అవసరం. ఒత్తిడి ఎక్కువైపోతే కణాలకు నష్టం జరుగుతుంది.

మధుమేహం, బీపీ, కేన్సర్, గుండె జబ్బుల వంటి సమస్యలు స్ట్రెస్ వల్ల వస్తాయని ఎన్నో అధ్యయనాల్లో వెల్లడైంది. ఆదుర్దాగా కాకుండా కాస్త నిదానంగా పనులు చేసుకోవడం, సమయానికి ముందుగానే బయల్దేరడం, మెడిటేషన్, యోగాసనాలు స్ట్రెస్ నుంచి విముక్తి కల్పిస్తాయి.

ఇక సామాజిక సంబంధాలు కూడా మన ఆరోగ్యం విషయంలో ప్రభావం చూపిస్తాయి. మంచి స్నేహితులతో, కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపాలి.

ఆ కోచ్ లు విషపూరితం.. బాబర్ వైఫల్యాలకు వారే కారణం:

# పాక్ మాజీ క్రికెటర్ యూసుఫ్ మండిపాటు



- బాబర్ అజామ్ ఫామ్ కోల్పోవడానికి కోచ్‌లే కారణమన్న మహ్మద్ యూసుఫ్
- జట్టులోని కొందరు కోచ్‌లు ఆటకు విషం లాంటివారని తీవ్ర విమర్శలు
- 2022 డిసెంబర్ నుంచి టెస్టుల్లో సెంచరీ చేయలేకపోయిన బాబర్
- ఆటగాళ్ల టెక్నిక్‌లోని లోపాలను సరిదిద్దడంలో కోచ్‌లు విఫలమయ్యారని ఆరోపణ
- ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లోనూ పాకిస్థాన్ పేలవ ప్రదర్శన

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ టెస్ట్ కెప్టెన్ బాబర్ అజామ్ సుదీర్ఘకాలంగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతుండటంపై ఆ దేశ మాజీ క్రికెటర్ మహ్మద్ యూసుఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. బాబర్ ఫామ్ కోల్పోవడానికి, అతని టెక్నిక్‌లోని లోపాలను సరిదిద్దుకోలేకపోవ డానికి జట్టులోని 'కొందరు కోచ్‌లే' కారణమంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. వారిని "ఆటకు విషం లాంటి వారు" అని అభివర్ణిస్తూ సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బాబర్ అజామ్ ఔటైన తీరును కామెంటేటర్ నాసిర్ హుస్సేన్ విశ్లేషించిన వీడియోను షేర్ చేస్తూ మహ్మద్ యూసుఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "కొన్నేళ్ల క్రితమే నేను ఈ విషయంపై హెచ్చరించాను. కానీ, బాబర్ చుట్టూ ఉన్న కొందరు నాసిరకం కోచ్‌లు అతనిలోని లోపాలను సరిదిద్దుకోవడానికి అనుమతించలేదు. సులభంగా పరిష్కరించగల సమస్యను కూడా వారు పట్టించుకోలేదు. ఆ వైఫల్యమే ఇప్పుడు పాకిస్థాన్ క్రికెట్‌ను ఈ పతనానికి లాగింది" అని యూసుఫ్ ఎక్స్‌లో పేర్కొన్నాడు. "ఈ కోచ్‌లు ఆట పట్ల విషపూరితమైన వారు. వారికి విజన్ లేదు, పురోగతిని అడ్డుకుంటారు, ప్రతిభావంతులైన ఆటగాళ్లను తప్పుదోవ పట్టిస్తారు. మన క్రికెటర్లు ఎవరి మాట వినాలో నేర్చుకోకపోతే వారి కెరీర్లు అనుకున్నదానికంటే ముందే ముగుస్తాయి. మన ఆటగాళ్ల బలహీనమైన టెక్నిక్ ఇప్పుడు బంగ్లాదేశ్ నుంచి ఇంగ్లండ్ వరకు బట్టబయలైంది" అని మండిపడ్డాడు. 2022 డిసెంబర్ తర్వాత బాబర్ అజామ్ ఇప్పటివరకు టెస్టుల్లో శతకం నమోదు చేయలేదు. అనేకసార్లు సెంచరీకి చేరువగా వచ్చినప్పటికీ విఫలమయ్యాడు. అతని ఫామ్‌తో పాటు పాకిస్థాన్ జట్టు ప్రదర్శన కూడా దారుణంగా ఉంది. విదేశాల్లో ఆడిన గత 10 మ్యాచ్‌ల్లో పాక్ 9 ఓడిపోయింది. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పాక్ కేవలం 110 పరుగులకే కుప్పకూలింది. పేలవ ఫామ్ కారణంగా 2023 చివర్లో కెప్టెన్సీ కోల్పోయిన బాబర్‌ను, షాన్ మసూద్ సారథ్యంలోనూ జట్టు వైఫల్యాలు కొనసాగడంతో 2026 జులైలో తిరిగి కెప్టెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

# దులీప్ ట్రోఫీలో చారిత్రక ఘట్టం.. 15 ఏళ్లకే కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ

- దులీప్ ట్రోఫీ సెమీస్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్‌గా 15 ఏళ్ల వైభవ్
- కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు గాయం కావడంతో అనూహ్యంగా బాధ్యతలు
- సీనియర్ ఆటగాళ్లు షమీ, ముఖేష్ ఉన్న జట్టుకు సారథ్యం
- భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దేందుకే వైస్ కెప్టెన్సీ అన్న సెలక్టర్లు
- భారత ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరుదైన ఘట్టంగా నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దేశవాళీ క్రికెట్‌లో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. కేవలం 15 ఏళ్ల వయసున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ, దులీప్ ట్రోఫీ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో ఈస్ట్ జోన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బెంగళూరు వేదికగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌లో రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడటంతో, వైస్ కెప్టెన్‌గా ఉన్న వైభవ్ ఈ అనూహ్య బాధ్యతలను స్వీకరించాడు. మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ సందర్భంగా ఈ సంఘటన చోటుచేసుకుంది. వికెట్ కీపింగ్ చేస్తున్న ఇషాన్ కిషన్ కుడి చేతి మణికట్టుకు బంతి బలంగా తాకింది. మైదానంలోనే ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ, నొప్పి తీవ్రంగా ఉండటంతో అతను మైదానాన్ని వీడాల్సి వచ్చింది. అనంతరం అతని చేతికి పెద్ద కట్టుతో డగౌట్‌లో కనిపించాడు. దీంతో ఇషాన్ స్థానంలో కుమార్ కుశాగ్ర వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టగా, కెప్టెన్సీ పగ్గాలు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ చేతికి వచ్చాయి. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇంత చిన్న వయసులో ఒక సీనియర్ జట్టుకు నాయకత్వం వహించడం ఒక అరుదైన రికార్డుగా నిలిచింది. వాస్తవానికి, ఈ టోర్నీకి ముందు వైభవ్ సూర్యవంశీని వైస్ కెప్టెన్‌గా నియమించడంపై దేశవాళీ క్రికెట్ వర్గాల్లో కొంత చర్చ జరిగింది. అయితే, ఈస్ట్ జోన్ సెలక్టర్లు తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. స్వల్పకాలిక అవసరాల కోసం కాకుండా భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దేందుకే ఈ కుర్రాడికి ఈ బాధ్యతలు అప్పగించామని స్పష్టం చేశారు. 2024 ఆరంభంలోనే ఫస్ట్ క్లాస్ అరంగేట్రం చేసిన వైభవ్‌కు ఇది కేవలం పదో ఫస్ట్ క్లాస్ మ్యాచ్, రెండో దులీప్ ట్రోఫీ మ్యాచ్ మాత్రమే. అనూహ్యంగా కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినప్పటికీ, వైభవ్ ఏమాత్రం తడబడలేదు. మైదానంలో ఉన్న ఆటగాళ్లందరిలో తానే చిన్నవాడైనా, మహ్మద్ షమీ, ముఖేష్ కుమార్, అభిమన్యు ఈశ్వరన్ వంటి అంతర్జాతీయ, దేశవాళీ అనుభవజ్ఞులతో కూడిన జట్టును సమర్థంగా నడిపించాడు. లంచ్ విరామానికి సెంట్రల్ జోన్‌ను 81 పరుగులకే 3 వికెట్లు కోల్పోయేలా చేయడంలో తన వ్యూహాలను అమలు చేశాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన బౌలర్లకు ఫీల్డింగ్ సెట్ చేస్తూ, యువ కెప్టెన్ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇషాన్ కిషన్ గాయం నుంచి ఎంత త్వరగా కోలుకున్నా, ఈ మ్యాచ్ మాత్రం భారత క్రికెట్‌లో వేగంగా ఎదుగుతున్న వైభవ్ సూర్యవంశీ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు.

# శ్రీలంకకు భారీ షాక్.. 2027 ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ హోస్టింగ్ రైట్స్ రద్దు చేసిన ఐసీసీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక క్రికెట్ బోర్డు కి అంతర్జాతీయ క్రికెట్ మండలి (×జజ) ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు జరగాల్సిన తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను శ్రీలంక నుంచి తరలించడానికి ఐసీసీ సంచలన నిర్ణయం తీసుకుంది. బోర్డు నిర్వహణలో పదే పదే లంక ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, ఐసీసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే ఈ కఠిన నిర్ణయానికి ప్రధాన కారణం. దీంతో ఈ మెగా టోర్నమెంట్‌ను శ్రీలంక నుంచి మరో దేశానికి తరలించనున్నారు.

**ప్రభుత్వ జోక్యమే ముంచేసింది:**

శ్రీలంక క్రికెట్ బోర్డు పాలనా వ్యవహారాలను ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన ట్రాన్స్‌ఫార్మేషన్ కమిటీ పర్యవేక్షిస్తోంది. క్రికెట్ బోర్డులు సర్కార్ నుంచి స్వతంత్రంగా, ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల ద్వారా మాత్రమే పనిచేయాలని ఐసీసీ స్పష్టమైన నియమం విధించినప్పటికీ లంక గవర్నమెంట్ మాత్రం దాన్ని పట్టించుకోలేదు. దాంతో ఆతిథ్య హక్కులు చేజారిన విషయాన్ని కమిటీ కార్యదర్శి ప్రకాష్ షాఫ్టర్ ధృవీకరించారు. ఈ టోర్నీని ఏ దేశంలో నిర్వహించాలనేది ఐసీసీ తదుపరి బోర్డు సమావేశంలో ఫిక్స్ చేయనుంది.

**గతంలోనూ ఇలాంటి ఘటన.. లంకకు భారీ ఆర్థిక నష్టం:**

ఐసీసీ నుంచి శ్రీలంకకు ఇలాంటి షాక్ తగలడం ఇదే తొలిసారి కాదు. 2023లోనూ ప్రభుత్వ జోక్యం కారణంగా శ్రీలంక క్రికెట్‌ను సస్పెండ్ చేసిన ఐసీసీ, 2024 పురుషుల అండర్-19 ప్రపంచకప్ ఆతిథ్య హక్కులను రద్దు చేసి దక్షిణాఫ్రికాకు బదిలీ చేసింది. ఇప్పుడు మరోసారి ప్రసిద్ధ టోర్నీని చేజార్చుకోవడంతో లంక క్రికెట్ బోర్డుకు కోట్ల రూపాయల ఆతిథ్య ఆదాయం కోల్పోవడంతో పాటు అక్కడి హోటళ్లు, పర్యాటక, వ్యాపార రంగాలు తీవ్రంగా నష్టపోనున్నాయి.

**టోర్నీలో లంక జట్టు అర్హతపై తీవ్ర అనిశ్చితి:**

ఆతిథ్య హక్కులు కోల్పోవడంతో పాటు ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రీలంక మహిళల జట్టు అసలు ఆడుతుందా లేదా అనేదానిపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం 6 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో ఆతిథ్య దేశ హోదాలో శ్రీలంకకు నేరుగా అర్హత దక్కాల్సి ఉంది. ప్రస్తుతం ఐసీసీ వన్డే/టీ20 ర్యాంకింగ్స్‌లో శ్రీలంక 6వ స్థానంలో ఉంది. ఇప్పుడు ఆతిథ్యం మరో దేశానికి మారితే, శ్రీలంకకు టోర్నీలో స్థానం దక్కుతుందో లేదో ఐసీసీ విడుదల చేసే కొత్త అర్హత నిబంధనలపై ఆధారపడి ఉంది.

# 2027 లో ముహూర్తం ఫిక్స్ చేసారా?

బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్, అలియాభట్ జంటగా అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన విజువల్ వండర్ -బ్రహ్మాస్త్ర: పార్ట్ వన్ - శివ- డివైడ్ టాక్ బయటపడిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ ప్రారంభంలోనే రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నామని ప్రకటించారు. అయితే మొదటి భాగం టాక్ తర్వాత రెండవ భాగం ఉండదని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయినా ఆ ప్రచారాన్ని యూనిట్ ఎప్పటికప్పుడు కొట్టి పారేసింది. అయినా పార్ట్ 2 తీసే ధైర్యం చేస్తారా? అన్న సందేహాలు మాత్రం ఆగలేదు. కాల క్రమంలో యూనిట్ ధీమా చూసి పార్ట్ 2 ఉంటుందని అంతా ఓ అంచనాకి వచ్చారు. తాజాగా ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లే సమయం గురించి ఓ క్రేజీ అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం -బ్రహ్మాస్త్ర 2- చిత్రాన్ని 2027 ఏప్రిల్ నుంచి పట్టాలెక్కించడానికి మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. మొదటి భాగం ముగింపులోనే రెండవ భాగానికి సంబంధించిన దేవ్ పాత్రను పరిచయం చేస్తూ అయాన్ ముఖర్జీ క్యూరియాసిటీని పెంచారు. దాంతో ఈ సీక్వెల్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా గ్రాండ్‌గా తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ సుదీర్ఘ ప్రీ-ప్రొడక్షన్ పనులను ప్లాన్ చేసింది. ఆలస్యానికి ప్రధాన కారణం రణబీర్ కపూర్ మిగతా భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటమే. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న -రామాయణ- షూటింగ్‌ను రణబీర్ త్వరలోనే పూర్తి చేయనున్నారు. సోర్సెస్ ద్వారా తెలిసిందేంటంటే? వచ్చే ఏడాది జనవరి నాటికి రణబీర్ రామాయణం నుంచి పూర్తి గా రిలీవ్ అవుతారని అంటున్నారు. అనంతరం రెండు..మూడు నెలల గ్యాప్ అనంతరం -బ్రహ్మాస్త్ర 2- లో రణబీర్ జాయిన్ అవుతారు. అయితే ఈ సీక్వెల్లో అనేక ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మొదటి భాగంలో ఈషాగా మెప్పించిన అలియా భట్, రెండవ భాగంలో అతిథి పాత్ర కే పరిమితం కానుందని టాక్. రణ్బీర్ కపూర్ ఈ చిత్రంలో దేవ్ -శివగా ద్విపాత్రాభినయం చేయబోతున్నారని సమాచారం. పవర్‌ఫుల్ అమృత పాత్ర కోసం సౌత్ నుంచి ఒక టాప్ హీరోయిన్‌ను రంగంలోకి దించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయట. నిర్మాణ పరంగా కూడా మేకర్స్ భారీ ప్లాన్లే వేశారు. విజువల్ వండర్‌ను గ్లోబల్ రేంజ్‌లో నిలబెట్టేందుకు -రామాయణ- నిర్మాత ప్రైమ్ ఫోకస్ అధినేత నమిత్ మల్హోత్రను ప్రాజెక్ట్‌లో ప్రధాన భాగస్వామిగా తీసుకొచ్చారు. గ్రాఫిక్స్ .. వీఎఫ్ ఎక్స్ ఆధారిత చిత్రాలకు నమిత్ మల్హోత్రా తోడవటం వల్ల సాంకేతిక ప్రమాణాలు నెక్స్ట్ లెవెల్‌లో ఉండబో తున్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.







Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965